పుస్తకం - 1

# సంఘకాపరుల చేతి పుస్తకం

మరియు

# పరిశుద్ధాత్మ

**బైబిల్ బోధకులు మరియు విద్యార్థులకు పరిశుద్ధ లేఖనాల మార్గదర్శి**

- ఆల్బర్ట్ ఫెయిర్ వెదర్



"దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి"

- అ.పో.కా. 20:28

# మనం విశ్వసించేది ఏమిటి?

# మన విశ్వాస ప్రమాణం

1. పరిశుద్ధ బైబిల్ గ్రంథం దేవుని చేత ప్రేరేపించబడిన దైవవాక్యం. ఆ వాక్యం సిద్ధాంతపరంగానూ మరియు అభ్యసించడానికి మాకున్న ఏకైక ప్రమాణ గ్రంథం అని నమ్ముచున్నాము.

2. దైవ త్రిత్వమును నమ్ముచున్నాము.

3. మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దైవత్వం మరియు పాపరహితమైన ఆయన మానవత్వంను నమ్ముచున్నాము.

4. పరిశుద్ధాత్మ యొక్క వ్యక్తిత్వం మరియు ఆయన దైవత్వాన్ని నమ్ముచున్నాము.

5. సృష్టి మరియు మనిషి యొక్క పతనం గూర్చి నమ్ముచున్నాము.

6. మానవాళి పాప ప్రక్షాళణకు మరియు విడుదలకు యేసు చేసిన సిలువ త్యాగం, ఆయన మరణ పునరుత్థానాలను నమ్ముచున్నాము.

7. యేసు ప్రభువు వెయ్యేండ్ల పరిపాలనకు ముందే తిరిగి వస్తాడని వ్యక్తిగతంగా నమ్ముచున్నాము.

8. శరీర పునరుత్థానమును నమ్ముచున్నాము

9. జీవించియున్న వారికి మరియు చనిపోయిన వారికి ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా ఒక దినాన తీర్పు ఉన్నది అని నమ్ముచున్నాము.

10. నీతిమంతులకు శాశ్వతమైన ఆశీర్వాదం మరియు దుష్టులకు శాశ్వతమైన శిక్ష ఉన్నదని నమ్ముచున్నాము.

11. దేవుడు సృష్టించినప్పటికీ గర్వంతో నాశనానికి పడద్రోయబడిన సాతాను యొక్క వాస్తవికత మరియు వ్యక్తిత్వంను నమ్ముచున్నాము.

12. రక్షణ కోసం నూతన జన్మ యొక్క ఆవశ్యకతను నమ్ముచున్నాము.

13. క్రైస్తవులుగా పిలువబడిన వారందరూ సత్కార్యములు చేస్తూ దైవిక జీవన విధానం కలిగియుండాలని నమ్ముచున్నాము.

14. విశ్వాసి యొక్క శాశ్వతమైన భద్రతను నమ్ముచున్నాము.

15. విశ్వాసులందరూ నీళ్ళలో ముంచబడుట ద్వారా బాప్తీస్మం పొందాలని నమ్ముచున్నాము

16. అపోస్థలులు, ప్రవక్తలు, ఆదిమ సంఘం యొక్క ప్రారంభ కాలానికి చెందిన వారు. వీరు చేసిన అద్భుతాలు, స్వస్థతలు, సూచక క్రియలు, అన్య భాషలు ఇప్పుడు లేవు. ఎందుకంటే మనమిప్పుడు వాటికన్నా ముఖ్యమైన పరిశుద్ధ లేఖనాలను సంపూర్ణంగా కలిగియున్నాము. ఏదేమైనా దేవుని చిత్తమైతే ప్రార్థనల ఫలితంగా ఇప్పుడు కూడా ఆయన చిత్తానుసారంగా స్వస్థపరుస్తాడని నమ్ముచున్నాము.

17. స్థానిక సంఘం యొక్క ఆధ్యాత్మిక మార్గదర్శకులుగా పరిచారకులు మద్దతుతో కూడిన పెద్దల యొక్క బహుళత్వం సంఘ పరిపాలన క్రమంలో బయట వారి నియంత్రణ దానిపైన లేకుండా ఉండునని నమ్ముచున్నాము. స్థానిక సంఘమునకు పరిచారకుల మద్ధతుతో కూడిన బహుళ నాయకత్వం ఆధ్యాత్మిక మార్గదర్శకులై యుండగా, దానిపై బయటివారి నియంత్రణ ఉండదు.

18. ప్రార్థన మరియు బోధన కోసం ప్రతి ఆదివారం సమాజముగా కూడుకొన్నప్పుడు ప్రభు బల్ల ఆరాధన పాటించాలని నమ్ముచున్నాము.

19. ప్రతి స్థానిక సంఘం యొక్క స్వయం ప్రతిపత్తిని మేము నమ్ముచున్నాము.

20. స్థానిక సంఘంలో, పురుషులు మరియు మహిళలు విభిన్న పాత్రలు మరియు విధులు కలిగి ఉంటారు. పురుషులు నాయకత్వ పాత్రలను పూరించాలి. అన్ని బహిరంగ పరిచర్య మరియు ప్రార్థనలలో నాయకత్వం వహించాలి.

# విషయసూచిక


| కాపరి చేతి పుస్తకం: | | పేజి నెం. |
|---|---|---|
| అధ్యాయం 1. | మంచి కాపరి | 7 |
| అధ్యాయం 2. | సంఘం అంటే ఏమిటి? | 11 |
| అధ్యాయం 3. | స్థానిక సంఘం | 16 |
| అధ్యాయం 4. | స్థానిక సంఘాల పనితీరు | 20 |
| అధ్యాయం 5. | స్థానిక సంఘాల యొక్క నాయకత్వం | 26 |
| అధ్యాయం 6. | సువార్తీకరణ మరియు సంఘ స్థాపన | 34 |
| అధ్యాయం 7. | దేవుని గృహం | 39 |
| అధ్యాయం 8. | ప్రభువు యొక్క రాకడ | 44 |
| 'పరిశుద్ధాత్మ'ను గూర్చిన అధ్యాయనం | | 48 |

# ఈ కాపరి చేతి పుస్తకమును గూర్చి కొన్ని విషయాలు

కాపరి చేతి పుస్తకం అనే ఈ పుస్తకం, దేవుని వాక్యంలో పేర్కొనిన నమూనాలో స్థానిక సంఘాలను నడిపించడానికి మరియు బోధించడానికి ప్రయత్నించే విధంగా పెద్దలు, బైబిల్ బోధకులు, మరియు బైబిల్ విద్యార్థులకు మార్గదర్శకంగా తయారు చేయబడింది. ఇది క్రొత్త క్రైస్తవులకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీనిని బైబిల్ పాఠశాలలో, తరగతి గదులలో మరియు సంఘాల్లో కూడా ఉపయోగించవచ్చు.

ఈ అధ్యయానాల్లో, శతాబ్దాలుగా క్రైస్తవ శాఖలు అభివృద్ధి చెందిన వివిధ సంస్థలు, డినామినేషన్లు అనుసరించే అభ్యాసాలు సిద్ధాంతాలు మనం ప్రతిసారి అనుసరించకపోవచ్చు. కానీ, బైబిల్‌లో నమోదు చేయబడిన ప్రకారం అపోస్థలులు ఏమి బోధించారో మొదటి సంఘం ఏమి అనుసరించిందో అనే సంగతులు గూర్చి నేర్చుకొంటాం.

“వెంటనే సహోదరులు రాత్రివేళ పౌలును సీలను బెరయకు పంపించిరి. వారు వచ్చి యూదుల సమాజ మందిరములో ప్రవేశించిరి. వీరు థెస్సలొనీకలో ఉన్న వారికంటె ఘనులైయుండిరి గనుక ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును, సీలయు చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతిదినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి. గ్రీసు దేశస్థులైన స్త్రీలలోను పురుషులలోను చాలామంది విశ్వసించిరి” (అ.పో.కా. 17:10–12) దయచేసి జాగ్రత్తగా అన్ని బైబిల్ రిఫరెన్సులు చదవండి.

దేవుని యొద్ద యోగ్యునిగాను సిగ్గపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరుచుకొనుటకు జాగ్రత్తపడుము. (2 తిమోతి 2:15)

## దేవుని వాక్యం యొక్క ప్రాముఖ్యత

పెద్దలకు బైబిల్ ఉపాధ్యాయులకు మరియు విశ్వాసులందరికి, దేవుని వాక్యాన్ని నమ్మకంగా బోధించాలని, ఆ వాక్యానికి విధేయులై జీవించాలనే అవగాహన ఉండాలి.

దేవుని వాక్య ప్రాముఖ్యతను గూర్చి క్రింది రిఫరెన్సులు గమనించుము.

- దేవుని వాక్యం దైవావేశం వలన కలిగినది (2 తిమో 3:16–17)
- దేవుని వాక్యం మానవుని ఊహను బట్టి కలుగలేదు (2 పేతురు 1:19–21)
- దేవుని వాక్యం ఎప్పటికీ గతించిపోకుండా శాశ్వతంగా నిలిచియుండేది (మత్తయి 24:35)

- దేవుని వాక్యం శక్తి గలది. హృదయాంతరంగములను పరిశోధించునది. (హెబ్రీ 4:12-13)
- ఆహారం కంటే దేవుని వాక్యం అవసరమైనది. (మత్తయి 4:4)
- దేవుని వాక్యం ఒకనిని శుద్ధీకరించి వాని జీవితాన్ని మార్చివేయగలిగినది. (కీర్తన 119:9, 1 పేతురు 2:1-3)
- దేవుని వాక్యం వ్యక్తిగతంగానూ, స్థానపరంగానూ పవిత్ర పర్చుతుంది. (అ.పో.కా. 20:32, కొలస్సీ 3:16)

విశ్వాసులందరూ బైబిల్ పట్ల గొప్ప భయభక్తులను, గౌరవమును కలిగియుండాలి. ఎందుకంటే, ఇది మన జీవితం మరియు విశ్వాసం యొక్క అన్ని రంగాల్లో మార్గ నిర్దేశం చేయడానికి ఇవ్వబడిన దైవవాక్యం. ఇది పరలోకానికి మార్గం చూపించి దేవునిని ఎలా మెప్పించాలో బోధిస్తుంది. దేవుని నడిపింపును వ్యతిరేకించి ఆయన వాక్యం పాటించడంలో విఫలమైన కారణంగా సౌలు రాజు తన రాజ్యాన్ని, జీవితాన్ని కోల్పోయాడు.

"సమూయేలు ప్రవక్త సౌలు రాజుతో ఈవిధంగా చెప్పాడు. "తాను సెలవిచ్చిన ఆజ్ఞనను ఒకడు గైకొనుటవలన యెహోవా సంతోషించునట్లు ఒకడు దహన బలులను, బలులను అర్పించుట వలన ఆయన సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుట కంటే ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటే మాట వినుటయు శ్రేష్ఠము. తిరుగుబాటు చేయుట సోదె చెప్పుటయను పాపముతో సమానము. మూర్ఖతను అగపరచుట మాయావిగ్రహము గృహదేవతలను పూజించుటతో సమానం. యెహోవా ఆజ్ఞను నీవు విసర్జించితివి గనుక నీవు రాజుగా ఉండకుండా ఆయన నిన్ను విసర్జించెను." (1 సమూ 15:22-23)

దేవుని వాక్యం ఆయన ప్రజలందరినీ వారి ప్రత్యేక పరిచర్య కొరకు సన్నద్ధం చేస్తుంది. ఆ వాక్యాన్ని జాగ్రత్తగా చదవాలి. (2 తిమో 2:16) (2 తిమో 3:16-17)

అపో. పౌలు ఎఫేసీ పెద్దలతో పలికిన పదాలను దయతో గమనించండి. "(సహోదరులారా) ఇప్పుడు దేవునికిని. ఆయన **కృపా వాక్యమునకును** మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటను పరిశుద్ధపర్చబడిన వారందరిలో స్వాస్థ్యమనుగ్రహించుటకు శక్తిమంతుడు (అ.పో.కా. 20:32)

## అధ్యాయం-1

# యేసు చెప్పెను "నేను మంచి కాపరిని"

యేసు ప్రభువును 'ప్రధాన కాపరి', 'గొప్ప కాపరి' అని కూడా పిలుస్తారు. ఆయన మన ఆత్మల పట్ల శ్రద్ధ కలిగియుంటాడు. ఆయన మన కాపరి అని మనం నిర్ధారించుకోవాలి.

యేసు ప్రభువు చెప్పెను. "నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని, మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణము పెట్టును (యోహాను 10:11) 'మంచి' అంటే స్వచ్ఛమైన, మరియు వాస్తవమైన అని అర్థం. ఆయన మాట మీద నిలబడేవాడు, నమ్మదగినవాడు. ఆయన 'గొఱ్ఱెల కోసం తన ప్రాణాన్ని' ఇచ్చాడు. ఆయనయందు విశ్వాసముంచిన వారు వారి జీవిత ప్రయాణంలో ఆయన చేత క్షమించబడి శాంతి, సమాధానం మరియు సంతోషం కలిగియుంటారు.

రాజైన దావీదు 23వ కీర్తనలో ఇలా చెప్పాడు 'యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించుచున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేదదీర్చుచున్నాడు తన నామమును బట్టి నీతిమార్గములలో నన్ను నడిపించుచున్నాడు". ధ్యానం మరియు సంభాషించుట ద్వారా దావీదు తన ప్రభువు యొక్క సహవాసాన్ని చాలా ఎక్కువగా ఆస్వాదించాడు. ఆయనలోనే శాంతి సమాధానలు దొరుకుతాయని దావీదు తెలుసుకొన్నాడు. "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు నీ దుడ్డుకఱ్ఱయు నీదండమును నన్ను ఆదరించును." కొన్ని శతాబ్ధాలుగా పరిశుద్ధులు ఈ కీర్తన ద్వారా ఆదరణ పొందుకొన్నారు.

## యేసు చాలా ఉపమానాలు బోధించాడు

శ్రోతలు అర్థం చేసుకోడానికి వారికి సుపరిచితమైన సంగతులతో 'ఉపమానం' ద్వారా బోధించడం వలన వారికి ఆధ్యాత్మిక సత్యం సులభంగా తెలుస్తుంది. అలాంటి తప్పిపోయిన నాలుగు రకాల వస్తువుల ఉపమానం గూర్చి మనం లూకా సువార్త 15వ అధ్యాయంలో నేర్చుకొంటాం. అక్కడున్న వారందరూ సుంకరులు, సమస్త విధమైన పాపులు మరియు మతోన్మాదులైన పరిసయ్యులు.

## తప్పిపోయిన గొఱ్ఱెను గూర్చి ఆయన సందేశం.

గొఱ్ఱెలు మూర్ఖమైనవి. అవి దారి విడిచి దూరంగా తిరిగే స్వభావాన్ని కల్గియుంటాయి. మంచి కాపరి 99 గొర్రెలను విచిపెట్టి తప్పిపోయిన ఒక గొర్రెను వెతుక్కుంటూ వెళ్ళి అది దొరికినప్పుడు దానిని తన భుజాలపై ఇంటికి మోసుకొచ్చాడు. మీరు నాతో కూడ సంతోషించుడి, తప్పిపోయిన నా గొఱ్ఱె దొరికినదని వారితో చెప్పును. ఆ తర్వాత యేసు ప్రభువు ఈవిధంగా చెప్పెను. "అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషముకంటె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:1-7). చాలా సమయాల్లో మనం కూడా మూర్ఖంగా వ్యవహరించి మనతో పాటు మన కుటుంబాల పైకి కూడా శ్రమలని తీసుకువచ్చాము. అయితే మన ప్రభువైన యేసు, మూర్ఖంగా తప్పిపోయిన మనలాంటి గొఱ్ఱెలను వెదకి రక్షించడానికి వచ్చిన 'మంచి కాపరి'.

## పోగొట్టుకున్న నాణెంపై ఆయన సందేశం.

ఒక స్త్రీ పది వెండి నాణెములు కలిగియుండి వాటిలో ఒకటి పోగొట్టుకుంది. నాణెం అనేది తనను తాను కనుగొనే సామర్థ్యం లేని ఒక పదార్థం. దానిని కనుగొనడానికి ఆ స్త్రీ దీపం వెలిగించి ఇల్లంతా ఊడ్చింది. ఎప్పుడైతే పోగొట్టుకొనిన వెండి నాణెం దొరికిందో ఆమె తన పొరుగువారిని పిలిచి ఈ విధంగా పలికింది. "నాతో కూడ సంతోషించుడి. నేను పోగొట్టుకొనిన నాణెము దొరకినదని వారితో చెప్పెను." ఆ తర్వాత యేసు ప్రభువు ఈవిధంగా చెప్పెను. "అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నాననెను" (లూకా 15:8-10). బైబిల్ ఈ విధంగా చెప్తుంది. "మీరు మీ అపరాధముల చేతను, పాపముల చేతను చచ్చిన వారైయుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను" (ఎఫేసీ 2:1). స్వభావం ప్రకారం మనం తప్పిపోయి, ఆధ్యాత్మికంగా చనిపోయినవారం. కానీ విశ్వసించుట ద్వారా మన 'మంచి కాపరియైన' క్రీస్తులో నూతన జీవితాన్ని పొందుతున్నాం.

## తప్పిపోయిన కుమారుని గూర్చి ఆయన సందేశం.

ఒక తండ్రికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నవాడు తండ్రి చనిపోవడానికి ముందే ఆస్తి పంపకాలు చేసుకొని తన వాటా తీసుకొని దూర ప్రాంతం

వెళ్ళి అల్లరి జీవితం గడిపి తన ఆస్తినంతా పోగొట్టుకొన్నాడు. చివరికి తను తిండి సంపాదించుకోవడం కోసం యూదులకి అపవిత్రమైన పందులను మేపే పనిలో చేరాడు. "అయితే బుద్ధి వచ్చినప్పుడు వాడు నా తండ్రియొద్ద ఎంతోమంది కూలివాండ్రకు అన్నము సమృద్ధిగా ఉన్నది, నేనైతే ఇక్కడ ఆకలికి చచ్చిపోవుచున్నాను. నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్ళి, తండ్రీ, నేను పరలోకమునకు విరోధముగాను, నీ యెదుటను పాపము చేసితిని; ఇక మీదట నీ కుమారుడనని అని పించుకొనుటకు యోగ్యుడను కాను; నన్ను నీ కూలి వారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదుననుకొని, లేచి తండ్రి యొద్దకు వచ్చెను (లూకా 15:11-24). నిజమైన పశ్చాత్తాపానికి ఈ ఉపమానం ఒక మంచి ఉదాహరణ.

తండ్రి అతని కోసం ఎదురుచూస్తూ 'బహుదూరం" నుండి వచ్చుట చూశాడు. తండ్రి ఎప్పుడైతే కుమారుడు రావడం చూశాడో వెంటనే అతనికి ఎదురుగా పరుగెత్తుకెళ్ళి అతన్ని కలుసుకొని, మెడ మీద పడి ముద్దు పెట్టి, అతనికి క్రొత్త వస్త్రాలు తొడిగించి, గొప్ప విందును ఏర్పాటు చేశాడు. అప్పుడు తండ్రి ఇలా చెప్పెను. "ఈ నా కుమారుడు చనిపోయి మరలా బ్రతికెను. తప్పిపోయి దొరికెనని చెప్పెను. అంతట వారు సంతోషపడ సాగిరి". మత్తు పదార్థాలు మారకద్రవ్యాలు సేవించడం, వ్యభిచారం వంటి దురలవాట్లలో మునిగిపోయిన వారికి సహితం తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో ఈ ఉపమానం ద్వారా యేసు ప్రభువు తెలియజేశాడు. ఆయన మన జీవితాలను నూతనమైనవిగాను మరియు మనోహరమైనవిగాను చేయగలడు.

## పెద్ద కుమారుడిని గూర్చి ఆయన సందేశం:

ఈ సంగీతం, ఆనంద భరితమైన వాతావరణం ఎప్పుడైతే పెద్ద కుమారుడు చూశాడో అతను సంతోషంగా లేడు. "అందుకతడు తన తండ్రితో, ఇదిగో యిన్నియేండ్లు నుండి నిన్ను సేవించుచున్నానే, నీ ఆజ్ఞను నేనెన్నడును మీరలేదే అయినను నా స్నేహితులతో సంతోషపడునట్లు నీవు నాకెన్నడును ఒక మేకపిల్లనైన ఇయ్యలేదు. అయితే నీ ఆస్తిని వేశ్యలతో తిని వేసిన యీ నీ కుమారుడు రాగానే వీని కొరకు క్రొవ్విన దూడను వధించితివని చెప్పెను." గర్వంతో విర్రవీగే మతపరమైన పరిసయ్యులకు ఇది చక్కని ధృష్టాంతం. యేసు ప్రభువు వారిని కూడా రక్షించాలని అనుకొన్నాడు. కానీ తర్వాత వారే ఆయనను సిలువ వేశారు. అందుకు తండ్రి "కుమారుడా! నీవెల్లప్పుడును నాతో కూడా ఉన్నావు. నావన్నియు నీవి, మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే? ఈ

నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను. తప్పిపోయి దొరికెనని అతనితో చెప్పెను". (లూకా 15:25-32). మతపరంగా తప్పిపోయిన వారిని కూడా దేవుడు ప్రేమిస్తున్నాడు.

మనలో కొందరు ఇతరులకన్నా తీవ్రత ఎక్కువగా పాపం చేశారు. అయితే అది పాపాల తీవ్రత గూర్చి కాదు గానీ మన పాపము యొక్క వాస్తవాన్ని గురించి. బైబిల్ ఈవిధంగా చెప్తుంది. ఏ బేధము లేదు అందరునూ పాపం చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). యేసు చెప్పెను. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు లోకమునకు వచ్చెను (లూకా 19:10) ఆయన నిజముగా 'మంచి కాపరి'.

సిలువపై, భూత, వర్తమాన, భవిష్యత్తుల్లో చేసిన ప్రతి పాపానికి మన ప్రభువు వెల చెల్లించాడు! మరియు పశ్చాత్తాపం చెంది, ఆయన యొద్దకు వచ్చిన వారందరికీ ఆయన గొప్ప ప్రేమతో, పూర్తి క్షమాపణ మరియు శాశ్వత జీవాన్ని బహుమతిగా అందిస్తాడు.

## అధ్యాయం - 2

# సంఘము అంటే ఏమిటి?

మొట్ట మొదటిగా సంఘము అనే మాట మన ప్రభువైన యేసు మత్తయి 16:13-20 వచనాల్లో ప్రస్థావించారు. సంఘము అనే పదానికి గ్రీకు భాషలో వాడబడిన పదం "ఎక్లేసియా" అనగా "బయటికి పిలువబడిన జనాంగం" లేదా "ప్రత్యేకించబడిన గుంపు లేదా సమూహం" అని అర్థం. కొంతమంది గ్రీకులు వారి నగర వ్యవహారాలను నిర్వహించడానికి "ఎక్లేసియా (ఎన్నుకోబడిన కౌన్సిల్) ను ఏర్పాటు చేయడానికి ఎన్నుకోబడిన రీతిగా యూదులను, అన్యజనులను సర్వలోకంలో నుండి "ఆయన నామ మహిమార్థం" సమస్త ప్రజలను ఆయన తన "ఎక్లేసియా" ను లేదా సంఘాన్ని ఏర్పాటు చేయడానికి యేసు పిలిచాడు (అ.పో.కా. 15:14) సంఘం విశ్వాసులందరితో కూడిన సార్వత్రికమైనది. కాగా స్థానిక సంఘం ప్రభువుని ఆరాధించడానికి విశ్వాసులందరు కూడుకొనునది "సార్వత్రిక సంఘం" "స్థానిక సంఘం" అనే ఈ రెండు పదాలు నేను చాలాసార్లు ఉపయోగిస్తాను. "సార్వత్రిక సంఘం" అనే పదం బైబిల్‌లో ఎక్కడా వ్రాయబడలేదు. కానీ పెంతెకోస్తు నుండి ఇప్పటి వరకు విశ్వాసులందరు వారి మతపరమైన డినామినేషన్లతో సంబంధం లేకుండా సంఘంలో వారు ఎలా ఉన్నారో వివరించడానికి నేను దీనిని ఉపయోగిస్తాను మనము బైబిల్ చదువుచున్నప్పుడు సందర్భాన్ని బట్టి అది సార్వత్రిక సంఘాన్ని గూర్చి వ్రాయబడినదా లేదా స్థానిక సంఘాన్ని గూర్చి వ్రాయబడినదా అని మనకు అర్థమవుతుంది. ఇవి రెండూ కూడా "దేవుని సంఘాలు" అని తరచుగా పిలువబడ్డాయి. పాత నిబంధన గ్రంథంలో సంఘాన్ని చూడము. కానీ, తన దేవుడు ప్రత్యేకమైన దర్శనాన్ని ఇచ్చినట్లుగా పౌలు వ్రాశాడు. "మీ కొరకు నాకనుగ్రహింపబడిన దేవుని కృప విషయమైన యేర్పాటును గూర్చి మీరు వినియున్నారు. ఎట్లనగా క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియపరచ బడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివిన యెడల దానిని బట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు. ఈ మర్మమిప్పుడు ఆత్మమూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తులులకును, ప్రవక్తలకును బయలుపరచబడియున్నట్లుగా పూర్వకాలములయందు మనుష్యులకు తెలియపరచబడలేదు" (ఎఫేసీ 3:3-5)

## పరిశుద్ధాత్మ మరియు సంఘము

తాను పరలోకానికి వెళ్ళిన తర్వాత "మీలో" నివసించడానికి పరిశుద్ధాత్మను పంపమని నేను తండ్రిని వేడుకొంటాను అని యేసు ప్రభువు ఆయన శిష్యులతో చెప్పాడు. దీనికి ముందు పరిశుద్ధాత్మ "వారితో" ఉన్నాడు (యోహాను 7:37-39) (యోహాను 14:15-18)

యేసు ప్రార్ధనలకు జవాబుగా ఆయన పునరుత్థానం చెందిన 50వ రోజు అనగా పెంతెకొస్తు దినాన దేవుడు పరిశుద్ధాత్మను పంపెను. అ.పో.కా 2) ఆ సమయంలోనే మొదటి సంఘం ఏర్పడింది. అప్పటి నుండి విశ్వసించిన వారందరూ పరిశుద్ధాత్మ ద్వారా బాప్తీస్మం పొంది క్రీస్తు శరీరంలో అనగా సంఘంలో చేర్చబడిరి (1 కొరింథీ 12:13 చదవండి). పరిశుద్ధాత్మ దేవుడు విశ్వాసుల హృదయాల్లో నివాసముండునట్లు సంఘము ఒక శరీరంగానూ, ఒక భవనంగానూ, పరిశుద్ధ మందిరంగానూ పిలువబడుతుంది (ఎఫేసీ 2:19-22).

దీనినే మనం సంఘం అంటాం. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూదులు మరియు అన్యజనులతో ఇది నిండి ఉంటుంది. చాలా మంది ఇప్పుడు పరలోకంలో ఉన్నారు. మన ప్రభువు వాగ్దానం చేసినట్లు ఆయన తిరిగి వచ్చి భూమిపైనున్న ఆయన సంఘాన్ని వారి స్వగృహమైన పరలోకానికి తీసుకువెళతాడు (1 థెస్స 4:13-18).

పెంతెకోస్తు అనగా "యాభై" అని అర్థం. పాత నిబంధనలోని యూదుల పండుగ ఇది. యేసు పునరుత్థానం చెందిన 50వ రోజున ఈ పండుగను వారు జరుపుకొనేవారు. ఈ పండుగలు దేవుడు మోషేతో చెప్పి పాత నిబంధన ప్రజలకిచ్చినవి. ఇవన్నియు క్రీస్తులో నెరవేర్చబడ్డాయి లేదా భవిష్యత్తులో నెరవేర్చబడతాయి. లేవీయకాండము 23వ అధ్యాయం జాగ్రత్తగా చదవండి.

## యేసు క్రీస్తు మరియు ఆయన సంఘము

మత్తయి 16:13-16. ఎప్పుడూ అడగని ఒక ప్రాముఖ్యమైన ప్రశ్న యేసు తన శిష్యులను అడిగాడు. అదేమనగా మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారు? శిష్యులు వివిధమైన సమాధానాలు చెప్పారు. కానీ సీమోను పేతురు మాత్రం నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను. మన పరలోకపు

తండ్రి దీనిని పేతురుకి వెల్లడిపర్చినట్లు ఆయనయందు విశ్వాసముంచువారికి అనగా క్రీస్తే పాపముల నుండి రక్షించువాడని నమ్ము ప్రతి వానికి దేవుడే ఈ సంగతి బయలు పరచుతాడు (మత్తయి 11:25-30)

మత్తయి 16:17-18. అప్పుడు యేసు చెప్పెను. "నీవు పేతురువు" (గ్రీకు భాషలో "పెట్రోస్" అంటే చిన్న రాయి అని అర్థం). ఈ బండ మీద (గ్రీకు భాషలో 'పెట్రా' అంటే పునాది వేయదగిన పెద్ద రాయి అని అర్థం. ఇది క్రీస్తుని సూచిస్తుంది) "నా సంఘాన్ని నేను కట్టుదును". ఇక్కడ ప్రస్తావించబడిన చిన్న రాయి (పేతురు) పునాది వేయదగిన పెద్ద బండ (క్రీస్తు) మధ్యన వ్యత్యాసాలు గమనించండి.

మన ప్రభువైన యేసు 'మూలకు తల రాయి' ఆయన పైనే మన జీవితాలు కట్టబడుచున్నాయి. (1 పేతురు 2:6-8). యేసు ప్రభువు చెప్పెను. "కాబట్టి ఈ నా మాటలు విని వాటి ప్రకారం చేయువాడు బండ మీద ఇల్లు కట్టిన బుద్ధిమంతుని పోలియుండును (మత్తయి 7:21-29). కాబట్టి క్రైస్తవులకు వారి జీవితాల్లో ఎదురయ్యే తుఫానులు వారిని ఈ బండ మీద నుండి కదిలించలేవు.

మత్తయి 16:19. తాళపు చెవులు తలుపులను తెరుస్తాయి. మొదట యూదులకు (అ.పో.కా 2), తర్వాత సమరయులకు (అ.పో.కా.8), ఆ తర్వాత అన్యులకు (అ.పో.కా 10) రక్షణ తలుపులు తెరిచేందుకు పేతురుకు తాళాలు ఇవ్వబడ్డాయి.

మత్తయి 4:18,19 ప్రభువును వెంబడించదానికి పేతురు పిలువబడ్డాడు. "నన్ను వెంబడించుము, నిన్ను మనుష్యులను పట్టు జాలరిగా చేస్తాను" అని యేసు పేతురుతో చెప్పాడు (మత్తయి 4:18). ఆయన పిలుపుకు మనం స్పందిస్తే, పేతురు పట్ల ఆయన కలిగియున్న ప్రణాళికవలెనే మన పట్ల కూడా ఆయన ఒక ఉద్దేశ్యం కలిగియుంటాడు. దేవుడు మనకి అనుగ్రహించిన తలాంతులు, వరాలు ఆయన మహిమ కోసం మనం వాడినప్పుడు ఆయన మన జీవితాలు దేవునికి ప్రయోజనకరమైనవిగా చేస్తాడు.

మానవాళి యొక్క మూడు విభజనలు: బైబిల్ ఈ విధంగా చెప్తుంది. "యూదులకైనను, గ్రీసు దేశస్థుల కైనను (అన్యులు) దేవుని సంఘమునకైనను అభ్యంతరము కలుగ జేయకుడి" (1 కొరింథీ 10:32). సంఘము యూదులు మరియు అన్యుల నుండి ఏర్పడింది. నీవు ఒక యూదుడవు కాకపోతే అన్యుడవే. సమస్త జనములలో ఒకడివి. సంఘము క్రీస్తుపైన నిర్మించబడింది. అంతేకానీ ముమ్మారు

క్రీస్తు ప్రభువు యొక్క ఆధిపత్యాన్ని తృణీకరించి, ఆ తర్వాత పౌలు గద్దింపునకు లోనైన పేతురుపైన కాదు (గలతీ 2).

పరలోకపు తాళపు చెవులు కలిగియున్నది పేతురు కాదు. యేసే వాటిని కలిగియున్నాడు.

## సంఘము మరియు ఇశ్రాయేలు

సంఘము మోషే యొక్క ధర్మశాస్త్రం క్రింద లేదు. ధర్మశాస్త్రం కేవలం ఇశ్రాయేలీయులకు మాత్రమే ఇవ్వబడింది. సంఘము, క్రీస్తు యొక్క నూతన సృష్టి అది కృప క్రింద ఉంది (2 కొరింథీ 5:17) (ఎఫెసీ 2:8-10). “ధర్మశాస్త్రం మోషే ద్వారా అనుగ్రహింపబడెను. కృపయు సత్యమును యేసు క్రీస్తు ద్వారా కలిగెను” (యోహాను 1:15-18)

మొట్టమొదటిసారిగా మన ప్రభువైన యేసు సంఘమును గూర్చి మత్తయి 16:13-19 లో ప్రస్తావించాడు. “నా సంఘాన్ని నేను కట్టుదును” అని ఆయన అన్నప్పుడు అది భవిష్యత్‌లో జరుగనైయున్న సంగతి. “నా సంఘాన్ని నేను కట్టుచూ ఉన్నాను” అని ఆయన చెప్పలేదు.

పెంతెకోస్తు దినాన అనగా యేసు పునరుత్థానుడైన 50వ రోజు వాస్తవమైన సంఘము స్థాపించబడింది (అ.పో.కా.2). క్రీస్తు రెండవ రాకడలో ఈ సంఘము ఆకాశమండలంలో క్రీస్తుని ఎదుర్కొనుటకు మేఘముల మీద కొనిపోబడును (1 థెస్స 4:13-18). ఆయా దేశాల మధ్య చెదరగొట్టబడిన 2000 సంవత్సరాల తర్వాత నేడు జరుగుతున్నట్లుగా, ఇజ్రాయెల్ అవిశ్వాసంతో తమ దేశానికి తిరిగి వస్తుంది.

సంఘము ఎత్తబడిన తర్వాత “గొప్ప శ్రమల కాలం” ప్రారంభమవుతుంది. “యాకోబు యొక్క శ్రమల సమయం” ప్రారంభమవుతుంది. యాకోబు అనగా ఇశ్రాయేలు. ఇశ్రాయేలు మోకాళ్ళ అనుభవానికి వచ్చినప్పుడు, అది ప్రభువు వైపునకు తిరుగుతుంది, జెకర్యా 12-14 అధ్యాయాల్లో, రోమా 9-11 అధ్యాయాల్లో చెప్పబడినట్లుగా ఇశ్రాయేలు ఆధ్యాత్మికంగా పునరుద్ధరించబడుతుంది. ఇశ్రాయేలీయుల భవిష్యత్‌ను గూర్చి యెషయా 11వ అధ్యాయంలో చెప్పబడింది.

ఈ దినాల్లో ప్రభువు తన సంఘాన్ని స్థాపించడానికి ఆయన నామం కోసం యూదులు మరియు అన్యజనుల నుండి ప్రజలను ఏర్పరచుకున్నాడు.

మోషే ధర్మశాస్త్రానికి విధేయత చూపడం అనే షరతు వలన భూసంబంధమైన వారసత్వంగా కానాను భూభాగం ఇశ్రాయేలీయులకు వాగ్ధానం చేయబడింది. కేవలం క్రీస్తులో విశ్వాసముంచుట వలన సంఘానికి పరలోక వారసత్వం లభిస్తుంది.

ఇశ్రాయేలుకు విరుద్ధంగా, సార్వత్రిక సంఘం అనేది దేవుని కొత్త సృష్టి. ఇది క్రీస్తు పునరుత్థానం చెందిన 50 రోజులకు పెంతెకోస్తు దినాన ఉద్భవించింది. (అ.పో.కా 2) ఈ సార్వత్రిక సంఘం క్రీస్తులో విశ్వాసముంచుట ద్వారా ఆయన కృప వలన పర లోకంలో ఆధ్యాత్మిక వారసత్వం కలిగియుంది (ఎఫెసీ 2:1-10).(1 పేతురు 1:3-5)

కన్యకయైన వధువు సంఘము క్రీస్తు యొక్క శరీరము అది ఆయనకు చెందినది (2 కొరింథీ 11:2; ప్రకటన 19:6-8; ఎఫేసీ 1:22-23)

ఇశ్రాయేలు వ్యభిచారిణియైన ప్రభువు యొక్క వధువు. దాని వ్యభిచార కారణమును బట్టి అది పక్కన పెట్టబడింది. అయినప్పటికీ ప్రభువు యొక్క రాబోయే రాజ్యంలో అది మళ్ళీ పునరుద్ధరించబడుతుంది. "అయిననూ, స్త్రీ తన పురుషునికి విశ్వాస ఘాతకురాలగునట్లుగా ఇశ్రాయేలు వంశస్థులారా, నిశ్చయముగా మీరునూ నాకు విశ్వాసఘాతకులైతిరి. ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 3:20)

నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయైయున్నాడు. సైన్యములకధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు. ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు నీకు విమోచకుడు. సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు. నీ దేవుడు ఈ మాట సెలవిచ్చుచున్నాడు. విడువబడి దుఃఖాక్రాంతురాలైన భార్యను పురుషుడు రప్పించినట్లును తృణీకరింపబడిన యౌవనపు భార్యను పురుషుడు రప్పించినట్లును యెహోవా నిన్ను పిలుచుచున్నాడు. నిమిష మాత్రము నేను నిన్ను విసర్జించితిని గొప్ప వాత్సల్యముతో నిన్ను సమకూర్చెదను. మహోద్రేకము కలిగి నిమిషం మాత్రము నీకు విముఖుడనైతిని నిత్యమైన కృపతో నీకు వాత్సల్యము చూపుదును అని నీ విమోచకుడగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. నోవహు కాలమున జలప్రళయమును గూర్చి నేను చేసినట్లు చేయుదును జలములు భూమి మీదికి ఇకను పొర్లుచురావని నోవహు కాలమున నేను ఒట్టుపెట్టుకొనినట్లు నీమీద కోపముగా నుండననియు నిన్ను గద్దింపననియు నేను ఒట్టు పెట్టుకొనియున్నాను". (యెషయా 54:5-9)

ఒక జనాంగంగా, ఒక దేశంగా ఇశ్రాయేలీయుల యొక్క రక్షణ మరియు పునరుద్ధరణను వివరించే సంగతుల కోసం జెకర్యా 12-14 అధ్యాయాలు, రోమా 9-11 అధ్యాయాలు చదవండి.

## అధ్యాయం-3

# స్థానిక సంఘం

**సంఘమును గూర్చి రెండవ ప్రస్థాపన మత్తయి 18:1-20లో కనుగొంటాము.**

స్థానిక సంఘాల్లో మందను కాయడం మరియు బోధించడం అనేవి మన ప్రభువు యొక్క హృదయానికి అత్యంత ప్రీతికరమైన పనియైయుండగా అపోస్థలుడైన పౌలు ద్వారా ప్రభువే ఎఫెసులోని సంఘంలో పెద్దలకు ఈ ఆజ్ఞ ఇచ్చాడు.

"దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అ.పో.కా 20:17-36) సంఘమును కాయుట అనే పనికి కూడా ఒక ప్రత్యేకమైన బహుమానం ఉంది. ఇదే విషయాన్ని పేతురు సంఘపు పెద్దలతో చెప్పుచున్నాడు. "ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు." (1 పేతురు 5:1-5)

**స్థానిక సంఘం ప్రత్యేకమైనది:** ప్రతి స్థానిక సంఘం స్వయంప్రతిపత్తి కలిగి దేవునికి మాత్రమే జవాబుదారీగా ఉండాలి. ప్రకటన గ్రంథం మొదటి అధ్యాయంలో యేసు ప్రభువు ఏడు దీప స్థంభములు కలిగిన బంగారు దీపవృక్షం మధ్య సంచరించుచుండటాన్ని చూడొచ్చు. ఆ ఏడు దీప స్థంభాలు ప్రకటన 2-3 అధ్యాయాల్లో యేసు ప్రస్థావించిన ఏడు సంఘాలకు సాదృశ్యములు.

మన ప్రభువు ఒక సంఘంపైన అధికారం మరొక సంఘం కలిగియుండునట్లుగా స్థానిక సంఘాలను ఏర్పాటు చేయలేదు. ప్రతి స్థానిక సంఘం ప్రభువునకు మాత్రమే జవాబుదారీగా ఉండాలి. ప్రతి స్థానిక సంఘం స్వీయ పరిపాలన, స్వీయ వనరులు మరియు స్వీయ అభివృద్ధి లక్ష్యంగా కలిగి ఉండాలి.

స్థానిక సంఘం అంటే ఒక భవనం కాదు కానీ, ఆ భవనంలో కూడుకొనే విశ్వాసుల సముదాయం. నిజమైన విశ్వాసులందరూ క్రీస్తు శరీరమనబడిన నిజమైన సంఘంలో సభ్యులు.

**స్థానిక సంఘాన్ని గూర్చి ఈ అంశాలను గమనించండి.**

మత్తయి సువార్త 18:1-2లో ప్రభువైన యేసు శిష్యులకు ఇచ్చిన బోధన స్థానిక సంఘాలు ఏర్పడే సమయానికి వారిని సిద్ధం చేయడం మనకు కనిపిస్తుంది. స్థానిక సంఘాన్ని గూర్చి యేసు మొదటిసారిగా మత్తయి 18:17లో ప్రస్తావించాడు. ఈ విషయాలు యేసు తన శిష్యులకు బోధిస్తున్న సమయంలో సంఘము అనేది భవిష్యత్‌లో కట్టబడేదని మనం గుర్తుంచుకోవాలి.

ప్రజలు రక్షించబడినప్పుడు వారు స్థానిక సంఘాల్లో సహవాసంగా కూడుకొనేవారని అపోస్థలుల కార్యముల గ్రంథం మనకు తెలియజేస్తుంది. (అ.పో.కా. 2:42; 14:23). విశ్వాసులందరూ బైబిల్‌ను నమ్మే సంఘములో కూడివచ్చుటకు ఆసక్తి చూపించాలి. ఆయన నామంలో సహవాసంగా కూడుకోవాలని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించాడు (మత్తయి 18:20)

1. మత్తయి 18:1-4. సంఘంలోని సభ్యులందరూ మార్పు చెందినవారైయుండాలి. మనలను మనం తగ్గించుకొని, మన పాపాలను దేవుని యెదుట ఒప్పుకొని, యేసు ప్రభువు మాత్రమే మనలను మన పాపముల నుండి విడిపించగలడని విశ్వసించి చిన్న పిల్లలవలే మనమందరం క్రీస్తు యొద్దకు రావాలి. ఆవిధంగా మనము ఆయన దగ్గరకి వచ్చినప్పుడు మనలో ఒక నూతన కార్యాన్ని ఆయనే ప్రారంభించి దానిని ముగిస్తానని వాగ్దానం కూడా చేశాడు. (ఫిలిప్పీ 1:6). ఆయన దగ్గర మనము నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. ఈ ప్రపంచము నుండి నేర్చుకోకూడనివి లేదా విడిచి పెట్టవలసినవి కూడా చాలా ఉన్నాయి.
2. మత్తయి 18:5, 15-18. ప్రభువును అంగీకరించిన వారందరినీ సంఘం తన సహవాసంలోకి రానియ్యాలి. కొందరు అనైతిక కార్యకలాపాలు జరిగిస్తూ వారి పాపాన్ని బట్టి ప్రభువు దగ్గర పశ్చాత్తాపపడక, సంఘములో బేధములు కలిగించి దానిని విభజించే వారిని సంఘం తిరస్కరించాలి మరియు వారికి దూరంగా ఉండాలి. స్థానిక సంఘాల్లో తప్పకుండా ఇలా చేయాలి.(రోమా 16:17-18) (తీతుకు 3:10-11) (1 కొరింథీ 5:1-5)
3. మత్తయి 18:6-14. దేవుని పిల్లలను మనము ఆటంకపరచకూడదు, తృణీకరించ కూడదు మరియు వారు పాపం చేయునట్లు మనం కారణం కాకూడదు. మన జీవితాలను గమనిస్తున్న వారిని తప్పుదారి పట్టించకుండా, మన మాటలను మరియు మన మార్గాలను జాగ్రత్త వహిస్తూ విశ్వాసుల ముందు ప్రపంచం ముందు మనము ప్రభువునకు ప్రీతికరమైన జీవితాన్ని గడపాలి. ఎందుకంటే “మీరు యేసుక్రీస్తు వలననైన నీతిఫలములతో నిండికొనినవారై క్రీస్తు దినమునకు నిష్కపటులును నిర్దోషులను కావలెననియు ప్రార్థించుచున్నాను” (పిలిప్పీ 1:10) అని మనము చదువుతాం. యేసు ప్రభువు చెప్పిన విషయాన్ని కూడా ఇక్కడ ఉదాహరణగా చూద్దాం; “నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు; ఆయనకిష్టమైన కార్యము నేనెల్లప్పుడూ చేయుదును గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదని చెప్పెను” (యోహాను 8:29)

4. మత్తయి 18:15-18. స్థానిక సంఘం పాపాన్ని సహించని స్థలముగా ఉండాలి. దానిని ఎదుర్కోడానికి బైబిల్ బోధన మాత్రమే ప్రామాణికంగా ఆవలంభించాలి. ఎందుకంటే స్థానిక సంఘానికి క్రమశిక్షణ చేయడానికి అధికారం ఇయ్యబడింది. కాబట్టి సంఘం ఆవిధంగా క్రమశిక్షణ చెయ్యాలి. ఒకవేళ మన సహోదరుడు పాపం చేస్తే మొట్టమొదటిగా మనం చేయాల్సింది ఏంటంటే; మనం అతని దగ్గరకి వ్యక్తిగతంగా వెళ్ళి తన పాపాన్ని అతను జయించి దానిని అధిగమించునట్లుగా సహాయం చేయాలి. అతని పాపమును గూర్చి అందరికీ మనము ప్రచారం చేయకూడదు. ఒకవేళ అతను వినకపోతే, ప్రార్థనాపరులైన సంఘ సభ్యులు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది కలిసి వెళ్ళి ప్రేమపూర్వకంగా, శ్రద్ధతో అతనికి చెప్పే ప్రయత్నం చేయ్యాలి. ఇదంతా చేస్తున్నప్పుడు, మనము కూడా మన పాపములతో పోరాడుచున్నమనే విషయాన్ని గుర్తుంచుకొని తప్పిపోయిన ఆ సహోదరుడిని ఆధ్యాత్మికంగా మళ్ళీ పునరుద్ధరించడానికి ప్రయత్నించాలి (గలతీ 6:1). అయినప్పటికీ అతను వినకపోతే, ఆ విషయాన్ని బట్టి అంతిమ నిర్ణయం సంఘం తీసుకొనేలాగా దీనిని సంఘం దృష్టికి తీసుకురావాలి. ఈ విధంగా మనం దైవికమైన శ్రద్ధతో చేస్తే అది పరలోకమందున్న మన ప్రభువు చేత అంగీకరించబడి వర్తించబడి ఆయన చేత ఆమోదించబడుతుంది.

5. మత్తయి 18:19. సంగీత వాయిద్యాలు అన్నీ కలసి ఒక "శ్రావ్యమైన" సంగీతాన్ని ఎలా సమకూరుస్తాయో అలాగే భూమి మీద స్థానిక సంఘములో అందరూ కలసి ఏకమనస్సుతో, సామరస్యంతో "అంగీకరించే" అనుభవంలోకి వచ్చి, ప్రేమ, ఐక్యత లోనికి అందరూ కలసి నడవడానికి ఎప్పుడైతే "అంగీకరిస్తారో" అప్పుడు వారి ప్రార్థనలు అంగీకరించబడతాయి మరియు దేవుడు వారిని ఆశీర్వదిస్తాడు (కీర్తన 133 చదవండి).

6. మత్తయి 18:20. ఇది స్థానిక సంఘం యొక్క సరళమైన రూపం: "ఎక్కడ ఇద్దరు, ముగ్గురు నా నామములో కూడుకొన్నారో, వారి మధ్య నిశ్చయంగా నేనుంటానని" మన ప్రభువు చెప్పాడు. మనము ఏ మానవ నాయకుడి కోసమో, ఏ సంస్థ కోసమో, సమాజంగా కూడుకొనము. క్రీస్తు యేసు నామంలో మాత్రమే కూడుకొంటాము. ఆయనే అందరికీ ప్రభువైయున్నాడు.

**చేర్చుకొను విధానం.**

సంఘాలు ప్రభువు యొక్క విశ్వాసులను శ్రద్ధగా, ప్రేమపూర్వకంగా స్వీకరించాలి (రోమా 14:1) (రోమా 15:7). కొందరు తీసుకొచ్చే తప్పుడు బోధలను, సమస్యలను

అంగీకరించడానికి సంఘం ఎప్పుడూ అలాంటి వారికి అవకాశం ఇవ్వకూడదు. స్థానిక సంఘాల్లో సత్య వాక్యాన్ని బోధించడం అనేది పెద్దలు మరియు బైబిల్ ఉపాధ్యాయుల బాధ్యత. సంఘంలోకి ఒక తప్పుడు అవగాహనతో క్రొత్తగా వచ్చిన వారిని సంఘంలోని పెద్దలు కలుసుకొని వారికి సత్య వాక్యాన్ని నేర్పించాలి (తీతు 1:5–9)

**బైబిల్ ఈ విధంగా బోధిస్తుంది:**

నిజమైన సిద్ధాంతానికి విరుద్ధంగా విభజనలు మరియు తిరుగుబాటులకు కారణమయ్యే వారిని గమనించడం మరియు నివారించడం (రోమా 16:17–18)

అనైతిక కార్యకలాపాలు జరిగించే వారిని, త్రాగుబోతులను మీ సంఘానికి దూరంగా ఉంచండి (1 కొరింథీ 5:9–13)

ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారాలకి సంఘం ఖచ్చితంగా వ్యతిరేకంగా నిలబడాలి. మనము దేవుని కృప క్రింద ఉన్నవారము. మోషేకి ఇవ్వబడిన ధర్మశాస్త్రానికి మనకి ఎలాంటి సంబంధం లేదు. మనం దాని క్రింద లేము (గలతీ 5:1–5).

దేవుని వాక్య సత్యాన్ని తిరస్కరించేవాడిని రెండుసార్లు హెచ్చరించిన తర్వాత అతనిలో మార్పు కలగకపోతే అతన్ని సంఘం తిరస్కరించాలి. ఎందుకంటే ఆ వ్యక్తి తన సొంత ఆలోచనే నిజం అనుకొంటూ, వాక్యాన్ని లోబడక, దిద్దుబాటును అంగీకరించడు. అలాంటి వారి వలన సంఘంలో విభజనలు, సమస్యలు ఏర్పడతాయి (తీతుకు 3:10–11).

స్థానిక సంఘాలు మంచి క్రమశిక్షణ కలిగి, ఆరోగ్యకరమైన అపోస్థలుల సిద్ధాంతాలను బోధిస్తూ, తప్పును, తప్పుడు జీవితాలను జీవించేవారిని సంఘం తిరస్కరించాలని దేవుని వాక్యం బోధిస్తుంది.

మనం స్వాతంత్ర్యములోనికి పిలువబడ్డాము. బైబిల్ ఏదైతే సత్యం అని చెప్పిందో అది చేయడానికి మాత్రమే మనకి స్వేచ్ఛ ఇయ్యబడింది. అయితే, దేవుని వాక్యానికి విరుద్ధంగా మనం ఇష్టపడేదాన్ని చేయడానికి ఈ స్వేచ్ఛ అనేది ఒక అనుమతి కాదు. డ్రైవింగ్ లైసెన్స్ మనకు కారును నడపడానికి స్వేచ్ఛను ఇస్తుంది. కానీ రహదారికి పోకూడదని మార్గంలో నడపడానికి మన స్వంత ఇతర వ్యక్తుల ప్రాణాలకు హాని కలిగించే లైసెన్స్ కాదు! దేవుని వాక్యానికి అవిధేయత చూపడం 'క్రైస్తవ స్వేచ్ఛ' కాదు.

'కాబట్టి సహోదరులారా, నిలకడగా ఉండి మా నోటి మాటవలనైనను, మా పత్రిక వలననైనను మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి.

## అధ్యాయం - 4

# స్థానిక సంఘాల పనితీరు

అపోస్థలుల కార్యముల పుస్తకం మొదటి క్రైస్తవులు మరియు సంఘాలు చేసిన వారి క్రియలకు ఉదాహరణలు ఇస్తుంది. అందుకే ఇది "పరిశుద్దాత్మ కార్యముల గ్రంథం" అని కూడా పిలువబడుతుంది. క్రొత్త నిబంధన గ్రంథంలో పౌలు, యాకోబు, పేతురు మరియు యోహాను పత్రికల్లో వారు వ్రాసిన ఉపదేశాలు స్థానిక సంఘాలకు వారు ఏమి విశ్వసించాలి మరియు పరిశుద్ధ జీవితాలను ఎలా జీవించాలి అనే విషయాలపై బోధించాయి. తండ్రి యొద్ద నుండి పరిశుద్ధాత్మ పంపబడిన తర్వాత సంఘం ఏర్పడింది (అ.పో.కా 2:1-4). అప్పుడు సుమారు 120 మంది సహోదరులు యెరూషలేములో ఉన్నారు. పేతురు ప్రసంగించిన తర్వాత 3000 మంది సంఘంలో చేర్చబడ్డారు (అ.పో.కా. 2:40-41)

### ఇవి స్థానిక సంఘాల యొక్క కూడికలు

ఈ మొదటి క్రైస్తవులు "అపోస్తులుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగకయుండిరి" (అ.పో.కా 2:42)

### మొదటి క్రైస్తవులు ఎందుకు సంఘంగా కూడుకొనేవారు?

### 1. అపోస్థలుల బోధ కోసం

అపోస్థలుల బోధ లేదా వారి "సిద్ధాంతం" నేర్చుకోడానికి మొదటి క్రైస్తవులు కలుసుకొనేవారు. ప్రభువు ఏదైన ప్రత్యక్షంగా అపోస్తులులకి నేర్పించాడో, ఆ తర్వాత కాలంలో ప్రత్యక్షతల వలన ఏవేవి తెలియజేశాడో అవే సంగతులను అపోస్థలులు సంఘానికి నేర్పించారు. (అ.పో.కా. 1:1-3). ఇప్పుడు ఇవన్నీ క్రొత్త నిబంధనలో వ్రాయబడ్డాయి. మనం బోధించడానికి మరియు పాటించడానికి మనకిది అందుబాటులో ఉంది (అ.పో.కా. 16:4-5)

### 2. 'సహవాసం' కోసం.

వారికి కలిగినవి "ఉమ్మడిగా అందరూ పంచుకొనేవారు అని దీని అర్థం. మన ప్రభువైన యేసు క్రీస్తులో విశ్వాసముంచుట ద్వారా ఆయన మనకి అనుగ్రహించినవన్నీ ఉమ్మడిగా పంచుకోవడం వలన సంతోషిస్తాము. ఈ జీవిత

ప్రయాణంలో మనము ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ సహాయం చేసుకొంటాము. దేవుడే మనలను ఈ సహవాసంలోకి పిలిచి నడిపించువాడు (1 కొరింథీ 1:9; 10:14-16; 1 యోహాను 1వ అధ్యాయం). ప్రభువు యొక్క ప్రజల మధ్య మనకు ప్రేమపూర్వకమైన శ్రద్ధాసక్తులతో కూడిన "సహవాసం" అవసరం.

**3. రొట్టె విరచుట కోసం.**

మన ప్రభువు అప్పగించబడిన రాత్రి ఆయన ఒక రొట్టెను, ద్రాక్షరసాన్ని పట్టుకొని ఇది నా శరీరము, నా రక్తము. నన్ను జ్ఞాపకము చేసుకొనుటకై దీనిని చేయుడని తన శిష్యులకి ఆజ్ఞాపించాడు (లూకా 22:14-20) (1 కొరింథీ 11:23-34). రొట్టె సిలువలో నలుగగొట్టబడిన ఆయన శరీరం, ద్రాక్షారసం తాను మన పాప పరిహారం కోసం చిందించిన రక్తం అని మనకి జ్ఞాపకం చేస్తున్నాయి. ఆయన రక్తం ద్వారా మనం విమోచింపబడ్డాము (ఎఫెసీ 1:7). స్థానిక సంఘాలు వారంలో "మొదటి రోజు" అనగా సమాజంగా కూడుకొనే ప్రతి పునరుత్థాన దినమందు (ఆదివారం) ఇది సంఘాలలో నిర్వహించబడుతుంది (అ.పో.కా 20:7; 1 కొరింథీ 16:1-2). దేవుడు, సృష్టి నిర్మాణాన్ని మొదటి రోజున ప్రారంభించి ఆరవ రోజున "ముగించాడు". ప్రభువు మరణించినప్పుడు "సమాప్తమైనది" అని పలికెను (యోహాను 19:30). నెరవేర్చబడిన ధర్మశాస్త్రం యొక్క శాపం క్రింద ఆయన సబ్బాతు దినాన (శనివారం) సమాధిలో ఉన్నాడు, కానీ ఆయన మొదటి రోజు (ఆదివారం) పునరుత్థానుడైనాడు. క్రైస్తవులు ఆయన నూతన సృష్టి (2 కొరింథీ 5:17). కాబట్టి మనం వారంలో మొదటి రోజైన ఆదివారం నాడు ప్రభువు బల్లలో తప్పక పాల్గొనాలి.

**4. ప్రార్థన కోసం.**

ఒక ప్రార్థనా కూటంలోనే మొట్ట మొదటిగా సంఘం ప్రారంభమయ్యింది (అ.పో.కా 1:14; 2:1), ప్రార్థనలోనే కొనసాగింది (అ.పో.కా. 4:23-31; 12:12). సంఘ సభ్యులు ప్రార్థన చెయ్యగలగడానికి మరియు ఇతర అవసరాల కోసం సంఘ కూడికకు తగిన సమయాన్ని కేటాయించాలి.

1 తిమోతీ 2 : 2,3 నుండి పరిశీలిస్తే, ప్రార్థన అపోస్థలుల ద్వారా "అన్నింటి కంటే ముందుగా ప్రారంభించబడినదని మనం నేర్చుకొన్నాం. కాబట్టి ఇది చాలా ప్రాముఖ్యమైనది. ప్రార్థన యొక్క వివిధ అంశాలేవనగా:

1. విన్నపములు – మనం ఎందుకు ప్రార్థిస్తాం – ఒక అవసరం ఉందని మనం భావించినప్పుడు.
2. ప్రార్థనలు – మనం ఎవరికి ప్రార్థిస్తాం – మన దేవుడైన ప్రభువుకి భయభక్తులతో మరియు విశ్వాసంతో.
3. విజ్ఞాపనలు – ఇతరుల కొరకు ప్రార్థించుట – మన పరలోకపు తండ్రిని సంప్రదించే స్వేచ్ఛ, విశ్వాసం, పవిత్ర సాన్నిహిత్యం మరియు మన అభ్యర్థనలన్నింటినీ ఆయనకు తెలియజేసే అవకాశం మనకు ఉంది.
4. కృతజ్ఞతలు – ప్రార్థించడానికి కారణాలు – జవాబు పొందిన ప్రార్థనలు తీర్చబడిన అవసరాలను బట్టి చెల్లించునవి.
5. సమస్త ప్రజల కోసం – ఎవరి కోసం ప్రార్థించాలి. రాజులు మరియు సామాన్యులు – పక్షపాతం లేకుండా.

ఇవి స్థానిక సంఘం యొక్క సమావేశాలు, కలిసి సహవాసంను ఆస్వాదించే సమయాలు.

## సంఘ సమావేశాలు, దానిలో స్త్రీలు, పురుషుల పాత్రలు:

రొట్టె విరచుట లేదా ప్రభువు బల్ల: మన ప్రభువు ఈ బల్ల కార్యక్రమాన్ని జరిగించినప్పుడు, "నన్ను జ్ఞాపకం చేసుకోడానికి" దీనిని చేయుడని తన శిష్యులకు ఆజ్ఞాపించాడు. ఆయన ఒక "రొట్టెను" మరియు "ద్రాక్ష రసాన్ని" తాను నివసించిన ప్రజల మధ్య ఉపయోగించాడు (మార్కు 14:22-23)

**ద్రాక్షరసం:** ఇది బహుశా పులియబెట్టిన ద్రాక్ష రసాన్ని నీటితో బాగా కలిపి పల్చగా తయారు చేసినదైయుండవచ్చు. అది యూదులకు అప్పట్లో ఆచారంగా ఉండేది. చాలా మంది పేదలు మరియు గిరిజనులకు ఈ సదుపాయం అందుబాటులో ఉండకపోవచ్చు. అప్పుడు వాళ్ళు దీనికి ఒక ప్రత్యామ్నాయన్ని కనుగొనవలసియుంది. చాలా మంది విశ్వాసులు పులియబెట్టిన ద్రాక్షరసం త్రాగరు. ద్రాక్షరసం అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటప్పుడు కొంచెం పంచదార ఎక్కువ కలిపి చల్లార్చిన బ్లాక్ టీ వారు ప్రభువు బల్లలో ఉపయోగించవచ్చు.

**రొట్టె:** మన ప్రభువు ఉపయోగించిన ఆవిధమైన రొట్టె తయారు చెయ్యడం మనకు అసాధ్యం. కాబట్టి, పేద విశ్వాసులైతే బార్లీ గింజలతో చేసి పిండితోనూ, ధనిక విశ్వాసులైతే

గోధుమ పిండితోనూ, అప్పటి చేసిన రొట్టెను ఉపయోగించి యుండవచ్చు. ప్రభువు బల్లలో ఉపయోగించిన రొట్టె అనే మాటకు గ్రీకు భాషలో ఉపయోగించిన పదం "అర్టోస్" అంటే "ఏ రకమైన రొట్టె అయినా" అని అర్థం (W.E.Vine, Expository Dictionary). ఈ పదం సాధారణ రొట్టెని సూచిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలు ఉపయోగించే వివిధ రకాల ధాన్యాల నుండి ఈ రొట్టెను తయారు చేస్తారు. ఆఫ్రికా ఖండం ప్రజలు వారి రొట్టెను మొక్కజొన్న పిండితోనూ, ఆసియా ఖండం వారు బియ్యంతోనూ వారి రొట్టెను తయారు చేస్తారు. ఆయనను జ్ఞాపకం వేసుకొంటున్నప్పుడు దేవుడు మన హృదయాలను  చూస్తాడు. కాబట్టి, అక్షరార్థమైన ఈ పదాల్లో, చిహ్నాల్లో ఏవిధమైన మాయా మంత్రం లేదు. అవి 'కేవలం రొట్టె మరియు ద్రాక్షారసం" మాత్రమే. అయితే, ఇక్కడ విశ్వాసం మాత్రమే పరలోకసంబంధమైన మరియు దైవికమైన భక్తికి సంకేతం".

**ఆరాధన:** రొట్టె విరవడానికి ఆరాధనలో మన ప్రభువు నామాన్ని గొప్ప చేయడానికి, మహిమ పర్చడానికి ఆయన చేసిన కార్యాలను గూర్చి ఆయన ఏమైయున్నాడో అనే దానిని గూర్చి తగిన సందర్భానుసారమైన పాటలు కొన్ని పాడండి. ప్రభువైన యేసుక్రీస్తు గురించి చెప్పే బైబిల్ భాగాలను చదవడం మరియు ధ్యానం చేయడం కోసం సమయాన్ని వెచ్చించండి.  ఈ ఆరాధనలో పెద్దలు మాత్రమే కాకుండా ఎవరైనా సహోదరులు కూడా పాల్గొనవచ్చు. అలా ఆరాధన జరుగుచున్నప్పుడు ఆమెన్! అని చెప్పడంలోనూ, పాట పాడటంలోనూ విశ్వాసులందరూ పాలిభాగస్తులు అవుతారు. సంఘంలోని పురుషులు స్తుతులు చెల్లించడం, కృతజ్ఞతలు తెలియజేయడం, ప్రార్థన చేయడం, వాక్యాన్ని ధ్యానించడం లేదా పరిశుద్ధాత్మని సహాయంతో సందర్భానుసారంగా ప్రసంగించడంలో స్వేచ్ఛగా సంఘాన్ని నడిపిస్తారు. "ఆత్మచేత నడిపించబడడం" అనేది వ్యక్తిగత సిద్ధపాటుకి వ్యతిరేకం కాదు. ఆరాధన క్రమబద్ధంగానూ, గౌరవ ప్రధంగానూ, సమయం ప్రకారం. క్రమశిక్షణతో జరగాలి. ఆరాధనలో దేవునిని గౌరవించాలి, ఆయనను మహిమ పర్చాలి. ఆరాధన ద్వారా మనకు జ్ఞానాభివృద్ధి కలగాలి. పైన చెప్పిన సంఘ కూడికలన్నింటికీ సహోదరులు నాయకత్వం వహించాలి కానీ, 1 కొరింథీ 11-14 అధ్యాయాలు, 1 తిమోతీ 2వ అధ్యాయంలో ఉన్న నియమాల వలన సహోదరీలు మాత్రం ఈ విధమైన బహిరంగ సంఘ కూడికలు నడిపించడానికి అవకాశం లేదు.

## ప్రధానత్వము లేదా నాయకత్వం పై బోధన:

1 కొరింథీ 11:1–22 ఆధారంగా ప్రార్థనా సమావేశాల్లో పురుషుల తలలు కప్పుకోకూడదని, స్త్రీలు తలలపైన ముసుగు వేసుకోవాలని చాలా శతాబ్దాలుగా స్థానిక సంఘాల్లో బోధిస్తూ ఈవిధానాన్ని అనుసరించారు. ఈ విషయాన్ని గూర్చి పరిశీలించుదాం.

స్త్రీ, పురుషులపై తండ్రి మరియు క్రీస్తు యొక్క శిరస్సత్వం: మొదట పురుషులు, ఆ తర్వాత స్త్రీలు, సృష్టి యొక్క అసలు క్రమం. స్థానిక సంఘాలు తమ క్రమాన్ని శిరస్సత్వాన్ని వ్యక్తపరుస్తుండగా దేవదూతలు ప్రేక్షకులుగా చూస్తుంటారని పౌలు దినాలలో, ఒక "నానుడి", 'ఆచారం' లేక నమ్మకంగా 'భావించబడేది'.

పౌలుచెప్పిన ఈ మాటలు గమనించండి "ఇందునిమిత్తము ప్రభువునందు నాకు ప్రియుడును నమ్మకమైన నా కుమారుడునగు తిమోతిని మీ యొద్దకు పంపియున్నాను. అతడు క్రీస్తునందు నేను నడుచుకొను విధమును, అనగా ప్రతి స్థలములోను ప్రతి సంఘములోను నేను బోధించు విధమును, మీకు జ్ఞాపకము చేయును" (1 కొరింథీ 4:17).

ఇక్కడ సందర్భం సంఘ యొక్క సమావేశం: మీరందరు కూడి వచ్చుచుండగా మీరు ప్రభువు రాత్రి భోజనము చేయుట సాధ్యము కాదు. ఏలయనగా మీరు ఆ భోజనము చేయునప్పుడు ఒకనికంటె ఒకడు ముందుగా తన మట్టుకు తాను భోజనము చేయుచున్నాడు; ఇందువలన ఒకడు ఆకలిగొనును మరియొకడు మత్తుడవును (1 కొరింథీ 11:20–21).

కొరింథీ పట్టణం ఒక ఓడరేవు తీరాన ఉంది. విభిన్న సంస్కృతులతో మిళితమైన ఒక కుండ వంటిది ఈ పట్టణం. పౌలు ఇక్కడ ఏమి బోధించాడో, అన్ని సంఘాల్లో అదే బోధించాడు. పౌలు బోధించిన దానికి "కొరింథీ సంస్కృతితో సంబంధం లేదు, కానీ ప్రతిదీ "దేవుడు ఇచ్చిన క్రమానికి సంబంధించినది." వాస్తవానికి పౌలు క్రైస్తవులతో చెప్పింది యూదుల ఆచారానికి వ్యతిరేకంగా ఉంది. యూదా స్త్రీలు వారి సమాజ మందిరాల్లో ముసుగు తీస్తారు, పురుషులు ముసుగు వేస్తారు.

స్థానిక సంఘాల్లోనూ, వారి వారి గృహాల్లో స్త్రీ పురుషులు వేర్వేరు బాధ్యతలు కలిగియుంటారు. ఏది ఏమైనప్పటికీ, స్త్రీలు పురుషులకన్నా తక్కువ వారేమి కాదు.

“ఇందులో యూదుడని గ్రీసుదేశస్తుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును “ఏకముగా” ఉన్నారు” (గలతీ 3:28). స్త్రీలకు ప్రత్యేకమైన వరాలు మరియు పరిచర్యలు కూడా ఉన్నాయి. ఇతర స్త్రీలకు, పిల్లలకు బోధించడం, సంఘం వెలుపల సంఘ సమావేశాల్లో సాక్షులుగా ఉండటం వంటివి (తీతుకు 2:1-5; ఫిలిప్పీ 4:3)

దెబోరా సరళవృక్షం క్రింద కూర్చొని ప్రవచించిందే గానీ, ప్రత్యక్ష గుడారంలో కాదు (న్యాయాధి 4:4-5). ఫిలిప్పు యొక్క నలుగురు కుమార్తెలు సంఘం వెలుపల ప్రవచించారే గానీ సంఘంలో కాదు (అ.పో.కా 21:8-9). బైబిల్ తన మాటను తాను ఖండించుకోదు. భర్త భార్యకు శిరస్సుకాగా, ఆమె అతనికి లోబడవలసి ఉండగా, క్రీస్తు కూడా సంఘాన్ని ప్రేమించినట్లు అతడు ఆమెను ప్రేమించాలి. (ఎఫెసీ 5:22-33). భర్త భార్యను విశ్వాసంలో పెంపొందించడానికి ప్రయత్నించాలి, ఆలాగుననే ఆమె కూడా శరీరమనబడిన సంఘంలో భాగమైనందున ఆమె తన ప్రత్యేకమైన వరాలను ఉపయోగించుకోవడానికి మరియు అభివృద్ధి చేయడానికి ఆమెను ప్రోత్సహిస్తూ, భార్య మరియు తల్లిగా ఆమె పూర్తి సామర్థ్యాన్ని చేరుకునేలా చూడాలి.

క్రైస్తవుల గృహం క్రైస్తవ ప్రేమ మరియు సామరస్యం కలిగిన ఒక ప్రదేశంగా ఉండాలి. ఇరుగు పొరుగున ఉన్న అన్యులకు ఆ ఇల్లు ఒక మంచి ఉదాహరణగా ఉండాలి. కొన్ని సంస్కృతుల్లో భర్తలు భార్యలను గొడ్డును బాదినట్లు బాదేస్తారు. క్రైస్తవుల కుటుంబంలో ఇది ఏమాత్రము సరైన విధానం కాదు. ప్రిస్కిల్లా అపోల్లోకి బోధించడంలో తన భర్త అకులకు సహాయం చేసింది మరియు వారు వారి ఇంటిని నూతనంగా ఏర్పడిన సంఘానికి కూడికల కోసం ఇచ్చారు (అ.పో.కా. 18:1-26, 1 కొరింథీ 16:19). సంఘం యొక్క కిటికీలు సాంస్కృతిక మార్పుల గాలికి మరియు ప్రపంచ దృష్టికోణం నుండి వచ్చే జ్ఞానానికి తెరవబడతాయి. సంఘ పెద్దలు బైబిల్ బోధనకు విరుద్ధంగా వచ్చే మార్పులను ప్రతిఘటించాలి.

దేవుడు నిషేధించిన వాటిని చట్టబద్ధం చేసేందుకు ఇప్పుడు అనేక దేశాల్లో చట్టాలు రూపొందించబడ్డాయి. అలాంటి వాటిని ఆచరించే వారికి దేవుడు తీర్పు తీరుస్తాడు.

అధ్యాయం - 5

# స్థానిక సంఘాల యొక్క నాయకత్వం

సంఘ కాపరులకు, సేవకులకు బైబిల్‌లో వాడబడిన "పెద్దలు. "పర్యవేక్షించువాడు", "పరిచారకుడు", "సేవకుడు" అనే పదాలనే ఉపయోగిస్తాము అనే విషయాన్ని ఈ అధ్యయనంలో మీరు కనుగొనే ఉంటారు. బైబిల్‌లోలేని మరియు మానవుల కల్పిత బిరుదులైన "బిషప్", "ఫాదర్", "పాస్టర్", "రెవరెండ్" "యాజకుడు" వంటి పదాలు మనము ఉపయోగించము.

ఈ అధ్యయనాలలో, మన బైబిళ్ళలో నమోదు చేయబడినట్లుగా అపొస్తలులు ఏమి బోధించారు మరియు సంఘం యొక్క ప్రారంభంలో అనగా; మొదటి శతాబ్దంలో ప్రారంభ సంఘాలు ఏమి ఆచరించాయి అనే విషయాలనే మన విశ్వాసానికి మరియు సంఘ స్థాపనకు ప్రామాణికంగా తీసుకొంటున్నాం గాని క్రైస్థవ సంస్థలు ఏమి చెప్పాయి. శతాబ్దాలుగా వివిధ క్రైస్తవ శాఖలు వాడుకలోకి తెచ్చిన ఆచరణాలను సిద్ధాంతాలను పరిగణనలోనికి తీసుకొనము.

ఆస్ట్రేలియా మరియు తూర్పు ఆఫ్రికాలో సంఘ స్థాపనలో నేను దీన్ని నిరూపించాను. ప్రారంభ సంఘం ఆచరించిన దానిని మనం తిరిగి చేపట్టవచ్చు. ఇది నిజంగా పని చేస్తుంది. మనుష్యులు రూపొందించిన వాటికంటే దేవుని మార్గాలు శ్రేష్ఠమైనవి.

## <u>మొదటిగా,</u> అపోస్థలులు:

నిజమైన అపొస్తలులును, అబద్ధ అపోస్థలుల నుండి మనం గుర్తించగల విధానాన్ని గమనించండి. అపోస్తలుడు అనే పదానికి 'పంపబడినవాడు' అని అర్థం. వారు ఈ క్రింది విధంగా ఉన్నారు.

1. అపోస్థలులు ప్రభువుచేత ఎన్నుకోబడి నియమించబడినవారు (మార్కు 3:13-19).
2. ప్రభువు చేత "అపోస్థలులు" అని పేరు పెట్టబడినవారు (లూకా 6:12-16).
3. ప్రభువును గూర్చి సాక్ష్యమిచ్చుటకు ప్రభువు పంపినవారు (యోహాను 15:26-27)
4. యోహాను బాప్తీస్మం నుండి క్రీస్తు ఆరోహణ వరకు ఆయనతో కలిసియుండినవారు (అ.పో.కా. 1:21-26)

5. వారు ప్రభువును 'చూశారు' (1 కొరింథీ 9:1)

6. వారి అపొస్తలులత్వాన్ని ధృవీకరించడానికి సూచక క్రియలు మరియు అద్భుతాలు చేయగల సామర్థ్యం వారికి ఇవ్వబడింది (అ.పో.కా.5:12)

7. ఒక్క పౌలు తప్ప మిగతా అపోస్థలులందరూ ప్రభువును ఎరుగుదురు మరియు వారు ఆయనను 'చూశారు'. కడపట అకాలమందు పుట్టినట్టున్న పౌలు మాత్రం ప్రభువును అతని పరివర్తన సమయంలో 'చూశాడు' 1 కొరింథీ 15:8 (అ.పో.కా.9)

నేడు ఎవరునూ 'ప్రభువును చూడలేదు' మరియు 'అపోస్థలులని' అని చెప్పుకోలేరు. బైబిల్ ఈవిధంగా చెప్తుంది "ఏలయనగా అట్టివారు క్రీస్తు యొక్క అపోస్థలుల వేషము ధరించుకొనువారైయుండి దొంగ అపోస్థలులును, మోసగాండ్రైన పనివారునైయున్నారు (2 కొరింథీ 11:13–15).

అపొస్తలులు **'ఎలా జీవించారో' 'ఏమి బోధించారో'** అనే దానిపై (1 కొరింథీ అధ్యాయం 3) సంఘానికి పునాదులు వేశారు. (అ.పొ.కా.20:17–30) వారు చెప్పిన దానినే "అపోస్తలుల బోధ లేక అపోస్తలుల సిద్ధాంతం" అని అంటారు. "వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగకయుండిరి". వారు ఆయా పట్టణముల ద్వారా వెళ్లుచు, యెరుషలేములోనున్న అపొస్తలులును పెద్దలును నిర్ణయించిన విధులను గైకొనుటకు వాటిని వారికి అప్పగించిరి" (అ.పో.కా 2:42; 16:4). ఇది మన బైబిల్ గ్రంథములో వ్రాయబడినది. ఆ బైబిల్ గ్రంథం దైవావేశము వలన వ్రాయబడింది.

## పునాదులు వేయడం:

అపోస్తలులు మరియు ప్రవక్తలు సంఘం యొక్క పునాదుల కాలానికి చెందిన వారు. వారికి ప్రభువే భోధించాడు. ప్రభువు ఆరోహణమైన తర్వాత ఆ బోధనలను సంపూర్ణం చేయడానికి ప్రభువు యొక్క ప్రత్యక్షతలను పొందుకున్నారు (1కొరింథీ 3:9–23; ఎఫెసీ 2:19–21). దేవుని వాక్యం మన దగ్గర ఇప్పుడు సంపూర్ణంగా అందుబాటులో ఉంది కాబట్టి, వారికున్న ప్రత్యేకమైన వరాలు, అద్భుతాలు, భాషలు మరియు స్వస్థతలు ఇప్పుడు మన దగ్గర లేవు. దయచేసి 1 కొరింథీయులు 13:8–13: గమనించండి. 'సంపూర్ణమైనది' (గ్రీకు తటస్థ లింగం) వచ్చింది దేవుని వాక్యం 'పరిపూర్ణంగా' మనకి అందుబాటులో ఉంది. పరిపూర్ణం అనేది 'వ్యక్తి' కాదు. ఇది ఒక 'విషయం'. నేటి ప్రపంచంలో 'పరిపూర్ణమైన' 'విషయం' దైవ లేఖనాలు మాత్రమే ('పరిపూర్ణం' అంటే

'సమాప్తం'). 'పరిపూర్ణమైన' పూర్తి చేసిన లేఖనాలు మనకు సమీపంగా అందుబాటులో ఉన్నాయి. భూమిపై ఆయన 'పరిపూర్ణ' రాజ్యం చూపించబడుట అనునది మనకున్న సుదూర నిరీక్షణ. స్థానిక సంఘం యొక్క సాధారణ పనితీరు కోసం ఈ వరాలు నేడు అవసరం లేదు. అవి ప్రకృతిలో 'తాత్కాలికమైనవి', అపోస్థులుల సందేశం యొక్క **'ధృవీకరణ'** మరియు 'ప్రామాణికరణ' ప్రయోజనాల కోసం దేవుడు ప్రధానంగా ఉపయోగించారు. 1 కొరింథీ 14 అధ్యాయం ప్రకారం అపోస్తులులు కలిగిన ఆ వరాలు ఖచ్చితంగా ఒక నిర్ణీత కాలానికే పరిమితం చేయబడ్డాయి. ఏది ఏమైనప్పటికీ, ప్రార్ధనకు సమాధానంగా, ప్రభువు యొక్క చిత్తాన్ని బట్టి ఈరోజుల్లో కూడా అద్భుతాలు మరియు స్వస్థతలు కొన్ని సమయాల్లో జరుగుతాయని మేము నమ్ముతున్నాము. అపోస్థలులు తమ పనిని కొనసాగించడానికి అన్ని సంఘాల్లో పెద్దలను నియమించారు. సంఘాల్లో పెద్దలను నియమించేలా చూడాలని తిమోతి మరియు తీతుకు కూడా వారు సూచించారు.

విశ్వాసులు ప్రేమయందు తమ పెద్దలను గుర్తించి వారిని ఎక్కువగా సన్మానించాలి. (1 థెస్స 5:12-13). వారికి లోబడాలి (1 పేతురు 5:5).

అపోస్థలులు తమ బాధ్యతను 'పెద్దలకు' నేర్పారు. సంఘాల్లో 'పెద్దలను' నియమించమని మనకు సూచించబడింది. కానీ అపోస్థలులను కాదు. (అ.పో.కా. 14:23).

## <u>రెండవదిగా</u> - ప్రవక్తలు:

వరమివ్వబడిన ప్రవక్తల ద్వారా ప్రవచనం వచ్చింది. సహజ మార్గాల ద్వారా తెలుసుకోలేని వాటిని ప్రకటించడమే ప్రవచనం. ఇది భవిష్యత్ సంఘటనలు మరియు సిద్ధాంతాల యొక్క ప్రత్యక్షతలను గురించి హెచ్చరికలను కలిగి ఉంటుంది. దాని ఉద్దేశ్యం విశ్వాసులకు క్షేమాభివృద్ధి కలిగించడం (కట్టడం) (1 కొరింథీ 14:1-3), ప్రోత్సహించడం (కదిలించడం) మరియు ఓదార్పును ఐక్యతను కలిగించడం. ఆనాడు విశ్వాసుల వద్ద బైబిళ్లు లేనందున ప్రవక్తలు సంఘాల్లో దేవుని నుండి ప్రేరేపిత ప్రవచన సందేశాలను బోధించారు. ఆ రోజుల్లో పాతనిబంధన పుస్తకాల చుట్టలు అరుదైనవి, ఖరీదైనవి, స్థూలమైనవై కొన్ని మాత్రమే ఉండేవి. క్రీస్తు పునరుత్థానము ఆరోహణము. తర్వాత కొన్ని సంవత్సరాల వరకు కొత్తనిబంధన యొక్క మొదటి పుస్తకాలు వ్రాయబడలేదు. క్రీ.శ.96లో అపోస్థలుడైన యోహాను దేవుని ప్రత్యక్షతతో వ్రాసిన ప్రకటన గ్రంథంలో దైవ సందేశం యొక్క నియమావళి పూర్తయింది. దేవుడు చెప్పదలచినదంతా లేఖనాల్లో సంపూర్తిగా చెప్పాడు. బైబిల్‌కి వెలుపల ఆయన ఇంకేదీ

క్రొత్తగా ఎవరితోనూ చెప్పడు. మన బైబిళ్లలో సంపూర్తి చేసిన దేవుని ప్రత్యక్షతకు మనం కొత్తగా కలపకూడదు. (ప్రకటన 22:18–19; యూదా 3) మనకు తెలిసిన బైబిల్ చాలా కాలం తరువాత వచ్చింది.

ఈరోజు సంఘాల్లో పెద్దలు మరియు బోధకులు అపోస్థలుల మరియు ప్రవక్తల స్థానాన్ని భర్తీ చేశారు. సంపూర్ణంగా బయల్పరచబడిన దేవుని వాక్యంలో నుండి వారు బోధిస్తున్నప్పుడు వారు క్షేమాభివృద్ధి, హెచ్చరిక ఆదరణ కలిగించాలి.

**మూడవదిగా; కాపరులు లేదా పెద్దలు**

చాలా ఇంగ్లీషు బైబిళ్ళలో "పాస్టర్" అని అనువదించబడిన పదం వాస్తవ గ్రీకు పదమైన "పోయ్ మాయినో" నుండి "కాపరి" అని అనువదించబడాల్సింది. బైబిల్లో వాడిన పెద్దలు అనే పదానికి అర్థం సంఘ కాపరులు. ప్రతి సంఘం పెరిగే కొద్దీ బోధకులైన అనేక మంది పెద్దలు లేదా కాపరులు ఉండాలి. "నాయకులులేని జనులు చెడిపోవుదురు, ఆలోచనకర్తలు అనేకులుండట రక్షణకరము" (సామెతలు 11:14).

ఎఫెసులోని సంఘ పెద్దలను (బిషప్, రెవరెండ్, పాస్టర్ అని కాదు) మిలేతులో తనను కలవమని పౌలు పిలిపించాడు. (అ.పో.కా. 20:17) (ఫిలిప్పీ 1:1). ఈ పెద్దలకు పౌలు "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్ మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండండి (అ.పో.కా. 20:28). అని చెప్పారు.

**పెద్దల అర్హతలు మరియు సేవ:** 'పెద్ద' అనే పదం ఆధ్యాత్మికంగా పరిణతి చెందిన వ్యక్తిని వర్ణిస్తుంది. పెద్దల యొక్క 'పని' మందను 'పర్యవేక్షించడం' మరియు 'కాయడం'. పెద్దలకియ్యబడిన ఈ బాధ్యతలు అనేవి సంఘాన్ని జాగ్రత్తగా కాయడం మరియు పనులు అనేవి జరిగించుట కొరకే గానీ, వారి మీద అధికారం చెలాయించే ఒక పదవి వంటిది కాదు. కొన్ని ప్రాచీన బైబిల్ అనువాదాల్లో 'కాపరి' అని అర్థమిచ్చే గ్రీకు పదానికి "పాస్టర్" అని, "పర్యవేక్షించువాడు" అనే అర్థమిచ్చే పదానికి "బిషప్" అని అనువదించారు. ఈ పదాలు ఇప్పుడు సంఘ నాయకులకు అధికారిక బిరుదులుగా ఉపయోగించ బడుతున్నాయి. అయితే, అలా చేయడానికి దేవుని వాక్యం అధికారమివ్వడం లేదు.

అప్పుడాయన (యేసు) కూర్చుండి పండ్రెండుమందిని పిలిచి 'ఎవడైనను మొదటి వాడైయుండగోరిన యెడల, వాడందరిలో కడపటివాడును అందరికి పరిచారకుడునై యుండవలెనని చెప్పెను (మార్కు 9:35).

## పెద్దల హూందాతనం మరియు కర్తవ్యం

'పెద్ద' అనే పదం అతని బాధ్యతల "హూందాతనాన్ని" సూచిస్తుంది. "పై విచారణకర్త" మరియు "కాపరి" అనే పదాలు బాధ్యతల విధులను సూచిస్తాయి. పెద్దల విధులు మందను (సంఘాన్ని) "పర్యవేక్షించడం" మరియు "కాపు" కాయడం "పైవిచారణ" అనేది స్పష్టంగా కనబడునట్లుగా చాలా దూరంలో "ఒక ప్రముఖ ప్రదేశంలో నిలబడి", మంచి పచ్చిక బయళ్ళు, మంచి నీరు ఎక్కడ లభిస్తుందా మరియు అడవి జంతువుల నుండి ఏదైనా ప్రమాదం పొంచియుందా అనేది చూస్తూ "మందను పర్యవేక్షించడం" అని అర్థం. పెద్దలు మందను (సంఘాన్ని) ప్రమాదం నుండి రక్షించాలి.

మందకు దగ్గరగా ఉండి "కాపు కాయడం" అంటే "దేవుని వాక్యం ద్వారా మందను పోషిస్తూ ప్రత్యేక శ్రద్ధతో కూడిన ఇతర క్రియలు చేయడం పేతురు కూడా ఇదే విషయాన్ని (1 పేతురు 5:1-5)లో, పౌలు (అ.పో.కా. 20:28)లో, దావీదు 23వ కీర్తనలో "మంచి కాపరి" తన మంద పట్ల కలిగియున్న జాగ్రత్తను గూర్చి తెలియజేశారు.

'పాస్టర్' అనే పదం ఎఫెసీయులు 4:11 నుండి తీసుకోబడింది. అయితే, అది 'కాపరి' అని అనువదించబడాల్సియుంది. 'పాస్టర్' అనే పదానికి బైబిల్ బోధించిన దానికన్న మించిన అర్థం ఈ రోజు ఇవ్వబడింది. అది తరచుగ ఒక వ్యక్తిని తన తోటి విశ్వాసుల కంటే ఎక్కువ స్థాయిలో ఉంచుతున్నది. పెద్దలు 'కాపరులు' "మందతో కలసియుండే వారు". వీరు మందకు మాదిరికరమైన జీవితాలు కలిగియుండి నడిపిస్తారు.

**పేతురు ఇలా వ్రాశాడు:** "తోటి పెద్దను, క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని, బయలుపరచ బడబోవు మహిమలో పాలివాడనునైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమిచేత కాక దేవుని చిత్తప్రకారము ఇష్టపూర్వకముగాను, దుర్లాభాపేక్షతో కాక సిద్ధమనస్సుతోను, మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణచేయుచు దానిని కాయుడి మీకు అప్పగింపబడిన వారిపైన ప్రభువులైనట్టుండక మందకు మాదిరిలుగా ఉండుడి. (1 పేతురు 5:1-3)".

కాబట్టి పెద్ద, కాపరి, పైవిచారణకర్త అనే పదాలు బిరుదులుగా ఇవ్వబడి సంఘంలో తోటి విశ్వాసులతోనూ, మిగతా వారితోనూ కలవకుండా ప్రత్యేకంగా ఉండటానికి ఇయ్యబడినవి కావు. మత్తయి 23:1-12 లో యేసు కూడా దీనిని గూర్చి హెచ్చరించాడు. "మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు, మీరందరు

సహోదరులు, మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి: ఆయన పరలోకమందున్నాడు. మరియు మీరు గురువులని పిలువబడవద్దు. క్రీస్తు ఒక్కడే మీ గురువు. మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును".

పెద్దలు బలవంతంగా కాకుండా మాదిరికరమైన జీవితంతో నడిపిస్తారు. ఈ విధంగా వారు మంద (సంఘం) యొక్క గౌరవాన్ని చూరగొంటారు వారి పనులు బాధ్యతలను నిర్వర్తిస్తున్నందుకుగానూ సంఘము కాపరులను అత్యంత ప్రేమతో గౌరవించి, వారికి లోబడాలి. (1 థెస్స 5:12–13; హెబ్రీ 13:7, 17)

పెద్ద అంటే ఆధ్యాత్మికంగా పరిణితి చెందిన వ్యక్తి మందకు బోధించడం, పై విచారణ చేయడం, కాపుకాయడం మరియు మేపడం అనేవి అతనికివ్వబడిన తలాంతులు,

## పై విచారణ బాధ్యతల యొక్క ప్రాముఖ్యత:

స్థానిక సంఘాన్ని చూసుకునే పెద్దల ఆదర్శ సంఖ్య మూడు లేదా అంతకంటే ఎక్కువ. బైబిల్ దీనిని 'అధ్యక్షుడు' అని పిలుస్తుంది (1 తిమోతి 3:1–2). పెద్దలు క్రమం తప్పకుండా కలుసుకొని మందకు సంబంధించిన అన్ని విషయాలలో మార్గదర్శకత్వం కోసం ప్రభువు నడిపింపు కోసం కనిపెట్టి ఉండాలి. ఒక పెద్ద, తన తోటి పెద్దలను పరిపాలించకూడదు, కానీ అందరు వినయ పూర్వకంగా కలసి వచ్చి ఇతరులను తమ కంటే యోగ్యులుగా, గొప్పవారిగా భావించాలి. ప్రభువే అధిపతిగా దైవపరిపాలనలో స్థానిక సంఘం ఉంది.

1. బైబిల్ విధానంలో నాయకత్వాన్ని కలిగి ఉండాలంటే వారు బైబిల్ తెలిసిన ఆధ్యాత్మిక వ్యక్తులైయుండి వారి తలాంతులను వృద్ధి చేసుకోవడానికి మరింత ఉపయోగించుకోవడానికి ఆనందంతో సాధన చేస్తారు.
2. నాయకత్వంలో ఎవరైనా ఒక వ్యక్తిపై ఆధారపడటం అనేది, తలాంతుల అభివృద్ధి, సంఘ స్థాపనకు అడ్డంకులు లేదా పరిమితులు ఏర్పరచి చివరికి కాపరికి సహాయం కోసమై ఉన్న నిధులను ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడవచ్చు.
3. ఎక్కువ మంది పెద్దలు ఉండుట అనేది, వారికి అప్పగించబడిన మందను చూసుకునే బాధ్యతను పంచుకోవడానికి సహాయ పడుతుంది. ఇది వారి బలాలు మరియు

బలహీనతలతో కూడిన వారి వ్యక్తిత్వాలను సమతుల్యం చేస్తుంది. పెద్దలు దేవుని కొరకు ప్రార్ధనాపూర్వకంగా నిరీక్షిస్తున్నప్పుడు, ఆయన చిత్తం నెరవేరుతుంది.

"మీరు గొఱ్ఱెలవలె దారితప్పిపోతిరి గాని యిప్పుడు మీ ఆత్మల కాపరియు అధ్యక్షుడునైన ఆయన వైపునకు మళ్ళియున్నారు" (1 పేతురు 2:25).

**పెద్దలకు ఆర్థిక సహాయం:**

(వాక్యంలోనూ, ఆరోగ్యకరమైన సిద్ధాంతాల విషయాలలోనూ ఎక్కువగా శ్రమించేవారు") చాలా మంది పెద్దలు వారి ఆర్థికపరమైన అవసరాల కొరకు స్వీయ వనరులను కలిగియుంటారు వీరు సమయాన్నంతా వారి మందకు బోధించడానికి, కాపుకాయడానికి వెచ్చించేవారు. వీరు 'రెట్టింపు గౌరవానికి అర్హులుగా పరిగణించబడ్డారు'. సంఘాలు మరియు విశ్వాసులు వీరికి ఈవులిచ్చుట ద్వారా సహకరించాలి. (తిమోతి 5:17-18).

**పరిచారకులు లేదా సేవకులు (డీకన్స్)**

డీకన్స్ (అంటే 'పరిచారుకులు') స్థానిక సంఘం యొక్క పనిలో పెద్దలకు సహకరిస్తారు. పెద్దలు మరియు డీకన్‌లకు సంబంధించిన అర్హతలు 1 తిమోతి అధ్యాయం 3 మరియు తీతు 1వ అధ్యాయంలో చూస్తాము. వారు సంఘంలో మరియు సమాజంలో మంచి సాక్ష్యాన్ని కలిగియుండాలి, మంచి ప్రవర్తన కలిగియుండాలి, ఒకే భార్యను కలిగియుండాలి. పెద్దలు మరియు డీకన్ల భార్యలు విచక్షణ కలిగి దైవభక్తి గల స్త్రీలుగా ఉండాలి.

## నాల్గవది - ఉపదేశకులు

నేడు వరము కలిగిన ఉపదేశకుడు దేవుని వాక్యమును పరిగెవలె ఏరుకొని దుల్లగొట్టుకుంటారు. వరము కలిగిన ఉపదేశకులు దేవుని వాక్యాన్ని ధ్యానిస్తూ ఆయన కోసం వేచి ఉంటారు. ఏ లేఖనాలను చదవాలో మరియు మందకు ఏమి బోధించాలో దేవుని ఆత్మ వారి హృదయములలో ప్రేరేపణ కలిగిస్తారు. ప్రవక్తల స్థానంలో ఉపదేశకులు వచ్చారు. పెద్దలు కూడా బోధించగలగాలి. "అధ్యక్షుడగువాడు నిందారహితుడును, ఏకపత్నీ పురుషుడును, మితానుభవుడును స్వస్థబుద్ధిగలవాడును, మర్యాదస్థుడును, అతిథిప్రియుడును, బోధింపతగినవాడునైయుండి, మద్యపానియు కొట్టువాడునుకాక, సాత్వికుడును, జగడమాడనివాడును, ధనాపేక్షలేనివాడునై, సంపూర్ణ మాన్యత కలిగి

తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు, తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను” (1 తిమోతి 3:2-4)

## పారదర్శకత మరియు జవాబుదారీతనం

డబ్బు గురించి బైబిల్ బలమైన హెచ్చరిక ఇస్తుంది. ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి” (1 తిమోతి 6:10).

## డబ్బు ఒక శోధన కావచ్చు

కొందరు డబ్బుపై ఆశపడవచ్చు మరియు దుర్వినియోగం చేయవచ్చు లేదా సంఘం యొక్క నిధులను దొంగిలించవచ్చు. అన్ని కానుకలను, విరాళాలను ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పెద్దలు లేదా డీకన్‌లు లెక్కించి మంచి జమా ఖర్చుల పుస్తకాలను ఉపయోగిస్తూ సంతకం చేసి సురక్షితంగా బ్యాంక్‌లో వేయాలి. ఈ నిధులను ప్రభువు పనిలో ఏ అవసరానికి ఖర్చు చెయ్యాలో నిర్ణయించడానికి పెద్దలు మరియు పరిచారకులు సమావేశమై చర్చించాలి. ప్రభువు యొక్క ప్రజల అర్పణల విషయంలో గొప్ప జాగ్రత్త తీసుకోవాలి. ఎందుకంటే అది ప్రభువుకు ఇవ్వబడుతుంది.

యెరూషలేములోని పేద విశ్వాసులకు సంఘాలు ఇచ్చే కానుకల గురించి పౌలు ఇలా వ్రాశాడు: “మేమింత విస్తారమైన ధర్మము విషయమై పరిచారకులమై యున్నాము గనుక దానిని గూర్చి మామీద ఎవడును తప్పు మోపకుండా మేము జాగ్రత్తగా చూచుకొనుచు అతనిని పంపుచున్నాము. ఏలయనగా ప్రభువు దృష్టియందు మాత్రమే గాక మనుష్యుల దృష్టియందును యోగ్యమైన వాటిని గూర్చి శ్రద్ధగా ఆలోచించుకొను చున్నాము. మరియు వారితో కూడ మేము మా సహోదరుని పంపుచున్నాము. చాలా సంగతులలో అనేక పర్యాయములు అతనిని పరీక్షించి అతడు ఆసక్తిగలవాడనియు ఇప్పుడును మీ యెడల అతనికి కలిగిన విశేషమైన నమ్మికవలన మరి యెక్కువైన ఆసక్తిగలవాడనియు తెలిసికొనియున్నాము” (2 కొరింథీ 8:20-22).

పెద్దలు మరియు ఉపదేశకులు సంఘ సభ్యులకు వారి జీవితంలోని అన్ని అంశాలలో యథార్థత కలిగియుండుటను గురించి బోధించాలి.

అధ్యాయం - 6

# సువార్తీకరణ మరియు సంఘ స్థాపన

యేసు ప్రభువు పరలోకానికి ఆరోహణమై వెళ్ళడానికి ముందు, ఆయన తన శిష్యులకు ఈవిధంగా ఆజ్ఞాపించాడు. పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి, మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నింటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను". (మత్తయి 28:18-20) ఇది ప్రభువు ఇచ్చిన "గొప్ప ఆజ్ఞ".

## శిష్యులను తయారు చెయ్యడం

పేతరు, యోహాను, స్తెఫెను, ఫిలిప్పు, బర్నబా, పౌలు మరియు అనేక మంది ఇతరులకు ప్రభువును గురించి చెబుతూ సువార్త ప్రకటించారని అపోస్తలుల కార్యముల గ్రంథములో వ్రాయబడింది. సువార్తను విని చాలా మంది మార్చబడ్డారు మరియు కొత్త సంఘాలు స్థాపించబడ్డాయి. ఈ విధానం, ఈరోజు మనం అనుసరించాల్సిన నమూనాగా ఉండాలి.

శిష్యులను చేయడమంటే, కొత్త విశ్వాసులకు కొన్ని విషయాలు మాత్రమే కాదు, దేవుని వాక్యంలో కనిపించే 'అన్ని విషయాలను' బోధించడం. శిష్యుడు అంటే దేవున్ని అనుసరించడం నేర్చుకొనేవాడు. నేర్చుకోడానికి ఆయనను అనుసరించే 'క్రమశిక్షణగలవాడు'.

ఒక శిష్యుడు దేవుని వాక్యం యొక్క నిజమైన బోధను గురించి నిశ్చయత కలిగి ఉంటాడు. దాని నుండి వైదొలగడు. దేవుని వాక్యంలో వెల్లడి చేయబడిన ప్రభువు మరియు ఆయన మార్గాల పట్ల నిబద్ధతను కలిగి ఉంటాడు. అతడు స్థానిక సంఘం మరియు దాని కార్యకలాపాల పట్ల కూడా నిబద్ధతను కల్గిఉంటాడు.

## శిష్యులు పరిశుద్ధమైన జీవితాలను గడపాలి

ప్రభువు మనలను ఆయన మహిమ కొరకు వాడుకోవాలంటే మనము పరిశుద్ధమైన జీవితాలను గడపాలి. 'పరిశుద్ధమైనది' అనే పదానికి అర్థం. 'దేవుని ఉపయోగం కోసం ప్రత్యేకించబడింది. పాపాని విడిచిపెట్టి, స్వయం చిత్తాన్ని

నెరవేర్చుకోవడం ఆపివేయాలి. శిష్యులు ఈ క్రింది వాటిని చెయ్యాలి.

1. ప్రతిరోజూ దేవుని వాక్యాన్ని చదవడం మరియు ధ్యానించడం అలవాటు చేసుకోండి. ప్రతి వచనం గురించి ఆలోచించడానికి సమయాన్ని వెచ్చించి మన జీవితాలకు దాన్ని అన్వయించుకోవడం దీని అర్థం.
2. క్రీస్తులో మీ స్థానాన్ని గుర్తుంచుకోండి. “ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది. మనకు జీవమైయున్న క్రీస్తు ప్రత్యక్ష పర్చబడినప్పుడు మీరును ఆయనతో కూడా మహిమయందు ప్రత్యక్షపర్చబడుదురు” (కొలస్సీ 3:3-4). క్రీస్తు చనిపోయినప్పుడు, మీరునూ ఆయనలో మరణించారు. తరువాత ఆయనలో లేపబడ్డారు.

**ఇది పౌలుకు చాలా ముఖ్యమైన విషయం:** “నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడియున్నాను, ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను” (గలతీ 3:20).

**పౌలు సంఘాలకు ఈవిధంగా బోధించాడు:** “మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యము గలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమైయుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడా సిలువవేయబడెనని యెరుగుదుము” (రోమా 6:5-6)

### వెలుగులో నడవడం - దీనినే శిష్యులకు బోధించడం:

1. క్రీస్తు ఎదుట నీ పరిస్థితి ఏమిటి? మీరు పాపం చేసినప్పుడు, 1 యోహాను 1వ అధ్యాయం చదవండి. “మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును” (1 యోహాను 1:9). దేవుని కుమారుడైన యేసుక్రీస్తు రక్తం మనలను అన్ని పాపాల నుండి శుద్ధి చేస్తుంది (మనలను శుద్ధి చేస్తూనే ఉంటుంది). మీరు ఏదైనా పాపాన్ని ఒప్పుకొనిన తర్వాత, మీ మోకాళ్ళపై నుండి లేచి, దేవుని సేవ చేయడానికి వెళ్ళండి, ఎందుకంటే ఆయన మిమ్ములను క్షమించి, మీరు చేసిన ఆ పాపాన్ని మరచిపోయాడు.

2. క్రైస్తవులందరూ కొన్నిసార్లు పాపం చేస్తారు. మనం పరిపూర్ణులం కాదు. నేరారోపణ చేసే మనస్సాక్షి మిమ్మలను ఇబ్బంది పెట్టనివ్వదు, ఎందుకంటే మీరు క్షమించబడ్డారు. అపవాది మీ ముఖాన్ని బురదలో తొక్కిపెట్టి మెడపై కాలు పెట్టి మిమ్మల్ని నిలదీయాలను కుంటుంటాడు. ప్రభువు ముందు వినయంగా నడవడానికి మరియు ప్రతి శోధనను అధిగమించడానికి ఆయన కృప కోసం ప్రభువును అడగండి.

3. మీ స్వంత భావాలతో కాకుండా, దేవుని మీద విశ్వాసంతో నడవడం నేర్చుకోండి. వెలుగులో నడవడం అంటే మీకు మరియు ప్రభువుకు మధ్య తెలియబడని పాపం అంటూ ఏదీ ఉండకూడదు. "ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని చీకటిలో నడచిన యెడల మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసముగలవారమైయుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:6–7)

   మీరు వెలుగు క్రింద నిలబడితే, మీ నీడ మిమ్మల్ని వెంబడించదు. మనమందరం క్రీస్తు వెలుగులో అనగా ప్రేమలో మరియు నీతిలో నడుస్తుంటే, మనము ఆయనతో మరియు ఒకరితో ఒకరు సహవాసం కలిగి ఉంటాము. మనము ఆయన వెలుగు నుండి దూరంగా నడిచినట్లయితే, మన నీడలు మనల్ని వెంబడిస్తాయి. అప్పుడు పాపం చేయాలనే శోధన మనలో అధికమవుతుంది. తద్వారా మన ఆనందాన్ని కోల్పోతాము. మన చుట్టూ ఉన్నవారికి మరియు మన సంఘంలో సమస్యలను సృష్టిస్తాము.

4. సాక్ష్యమివ్వడం నేర్చుకోండి: క్రైస్తవేతరులకు ఎలా సాక్ష్యమివ్వాలో, ప్రభువైన యేసు గురించి ఎలా చెప్పాలో మరియు ఆయన, వారి పాపాల నుండి వారిని ఎలా రక్షించగలడో చెప్పడం మనము నేర్చుకోవాలి. మీరు క్రైస్తవులుగా ఎలా మారాలో చెప్పడం నేర్చుకోండి. ఇది మీ సాక్ష్యం! కాబట్టి "నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి మిమ్మును హేతువు అడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండి, మీ హృదయములయందు క్రీస్తును ప్రభువుగా ప్రతిష్ఠించుడి" (1 పేతురు 3:15)

దేవుని 'వాక్యాన్ని' మనం క్షుణ్ణంగా తెలుసుకోవాలి, కాబట్టి మనం "హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారి మాట ఖండించుటకును శక్తిగలవాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టు కొనువాడునైయుండవలెను" (తీతుకు 1:9)

క్రైస్తవులందరూ సువార్త ఆజ్ఞాపించిన ప్రకారం సన్మార్గంలో నడిచే జీవితాలను కలిగియుండడానికి మరియు మన ప్రభువైన యేసుక్రీస్తులో ఉన్న రక్షణ గూర్చి ఇతరులకు చెప్పడానికి అవకాశాల కోసం వెతకాల్సిన బాధ్యత మనకు ఉంది. థెస్సలొనీక సంఘంలోని విశ్వాసులు చేసింది ఇదే; "అక్కడ మాత్రమే గాక ప్రతి స్థలమందును దేవుని యెడల ఉన్న మీ విశ్వాసము వెల్లడాయెను గనుక, మేమేమియు చెప్పవలసిన అవశ్యము లేదు. మీయొద్ద మాకెట్టి ప్రవేశము కలిగెనో, అక్కడి జనులు మమ్మును గూర్చి తెలియజెప్పుచున్నారు. మరియు మీరు విగ్రహములను విడిచిపెట్టి, జీవము గలవాడును సత్యవంతుడునగు దేవునికి దాసులగుటకును, దేవుడు మృతులలోనుండి లేపిన యేసు అనగా రాబోవు ఉగ్రత నుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు, పరలోకము నుండి వచ్చునని ఎదురు చూచుటకును, మీరేలాగు దేవుని వైపునకు తిరిగితిరో ఆ సంగతి వారే తెలియజేయుచున్నారు" (1 థెస్స 1:8-10).

## బాప్తీస్మం మరియు అన్ని విషయాలను బోధించడం

తన శిష్యులు అందరూ బాప్తీస్మం తీసుకోవాలని యేసు ప్రభువు ఆజ్ఞాపించాడు. ఈ పదానికి 'ముంచడం' లేదా 'మునగడం' అని అర్థం. దీనికి చాలా నీరు అవసరమవుతుంది. ఎందుకంటే బాప్తీస్మం అనేది క్రీస్తు యొక్క మరణం, సమాధి మరియు పునరుత్థానములకు సాదృశ్యం. కాబట్టి బాప్తీస్మం ద్వారా ప్రతి శిష్యుడు క్రీస్తులో నూతన జీవితాన్ని కలిగియుంటాడు (రోమా 6వ అధ్యాయం). ఒక వ్యక్తి బాప్తీస్మం పొందాలంటే ఆ వ్యక్తి నీళ్ళలో పూర్తిగా ముంచబడి మరియు లేపబడాలి. కాబట్టి, దాని కోసం విస్తారమైన నీరు అవసరం (యోహాను 3:23). పిల్లలపై లేదా పెద్దవారిపై నీళ్ళు చిలకరించడం బైబిల్లో కనిపించదు.

అపోస్తలుల కార్యముల పుస్తకమును చదువుతున్నప్పుడు విశ్వాసులందరూ తమ విశ్వాసము యొక్క ఒప్పుకోలును బట్టి బాప్తిస్మము పొందారని మనము చూస్తాము. "వారు త్రోవలో వెళ్ళుచుండగా నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పు మరియు ఆ నపుంసకుడు ఇద్దరును నీళ్ళలోనికి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను" (అ.పో.కా. 8:36-38).

మనము తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ యొక్క ఏక నామమున బాప్తిస్మము పొందవలెను. ఇది మనకు త్రిత్వాన్ని గూర్చిన సత్యాన్ని బోధిస్తుంది. ముగ్గురు వ్యక్తులు, కానీ ఒకే దేవుడు. "ఆదియందు దేవుడు భూమ్యాకాశాలను సృజించెను" (ఆది 1:1) అని మనం చదువుతాం. హీబ్రూలో 'ఎలోహిమ్' అనే పదం త్రిత్వమైయున్న

ఒకే దేవునికి వాడిన పదం. దాని నుండి అనువందించబడిన 'దేవుడు' అనే పదంలో త్రియేక దేవుడు నిక్షిప్తమైయున్నాడు. ఇదే సత్యాన్ని తిరిగి వెల్లడిస్తున్న ఈ పదం బహువచనం. ఇదే సంగతిని మళ్ళీ మనం ఈ వచనాల్లో చూస్తాం. "దేవుడు, మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము; వారు సముద్రపు చేపలను, ఆకాశ పక్షులను, పశువులను, సమస్త భూమిని, దాని మీద ప్రతి జంతువును ఏలుదురుగాకనియు పలికెను (ఆది 1:26). యేసు చెప్పెను; "నన్ను చూసినవాడు తండ్రిని చూసినట్టే". మన ప్రభువు బాప్తీస్మం తీసుకొన్నప్పుడు త్రిత్వాన్ని చూస్తాము. ఎందుకంటే ఆత్మ పావురం రూపంలో కుమారుడైన యేసు పైకి దిగి వచ్చియుండగా పరలోకము నుండి తండ్రి స్వరం వినిపించింది (మత్తయి 3:13-17).

అపోస్తలులు క్రొత్తగా ప్రభువుని అంగీకరించిన వారికి ఏమి బోధించారో మనము కూడా శిష్యులకు అదే నేర్పించాలి. "వీరు అపోస్తలుల బోధయందును (అపోస్తలులు సిద్ధాంతం). సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగకయుండిరి" (అ.పో.కా. 2:42). యేసు చెప్పెను; "నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:20). మనము శిష్యులకు ఈ క్రింది విషయాలు బోధించాలి.

అ) అపొస్థలుల బోధనను అనుసరించడము

ఆ) ఇతర విశ్వాసులతో సహవాసం కలిగియుండడము

ఇ) ప్రభువు రాత్రి భోజనం పాటించడము

ఈ) ప్రార్థన కోసం సమాజంగా కూడుకోవడము

ప్రభువే సంఘాన్ని స్థాపించాడు (మత్తయి 16 & 18 అధ్యాయాలు). ఈ బోధనలను అమలు చేయడానికి లేదా పాటించడానికి వారంలో మొదటి రోజైన ప్రతి ఆదివారం లేదా ప్రభువు దినము రోజున విశ్వాసులందరూ కూడుకోవాలని ఆయన ఆశపడుచున్నాడు. మనము ప్రజలను క్రీస్తు దగ్గరలో నడిపిస్తున్నప్పుడు, ప్రభువు నామంలో వారిని కూడగట్టాలి (మత్తయి 18:20). అలాచేసి వారికి బైబిల్‌లో ఉన్న బోధలన్నింటినీ బోధించాలి.

"యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో ఉందునని యేసు చెప్పిన మాటను మనం జ్ఞాపకముంచుకోవాలి. ఆయన మీతో సదాకాలం ఉంటాడు. ప్రార్థనలో మీరు ఆయన వైపు చూస్తున్నప్పుడు, మీరు ముందుకు కొనసాగాల్చిన మార్గం యొక్క ద్వారాన్ని తెరచి ఆయన మీకు తెలియజేస్తాడు.

ఆయన వాక్యపు వెలుగులో మీరు నడుచునప్పుడు ఆ ప్రభువు మీకు సహాయం చేసి మిమ్మును ఆశీర్వదించును గాక!

## అధ్యాయం - 7

# దేవుని గృహం

ఇది స్థానిక సంఘాలకు గంభీరమైన బోధ. స్థానిక సంఘం క్రీస్తు శరీరం మరియు సార్వత్రిక సంఘంలో భాగం. సార్వత్రిక మరియు స్థానిక సంఘాలు రెండూ మిళితమై ఇక్కడ కనిపిస్తాయి.

అపోస్తలుడైన పౌలు రచనలలో, ప్రభువు తన ప్రజలను మరియు వారు సమాజంగా కూడుకొనే స్థానిక సంఘాలను ఎలా విలువైనవిగా పరిగణిస్తాడో మనకు బోధించబడింది. "మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు, మీరెరుగరా? ఎవడైననూ దేవుని ఆలయాన్ని పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును. దేవుని ఆలయం పరిశుద్ధమైయున్నది. మీరు ఆ ఆలయమైయున్నారు" (1 కొరింథీ 3:16-17). స్థానిక సంఘం మరియు మన దేహాలు దేవుని మందిరాలు! ఆయన గృహంలో మన ప్రవర్తనను మనం గమనించాలి. "శీఘ్రముగా నీ యొద్దకు వత్తునని నిరీక్షించుచున్నాను. అయినను, నేను ఆలస్యము చేసిన యెడల దేవుని మందిరములో అనగా జీవముగల దేవుని సంఘములో జనులేలాగు ప్రవర్తింపవలెనో అది నీకు తెలియవలెనని ఈ సంగతులను నీకు వ్రాయుచున్నాను. ఆ సంఘము సత్యమునకు స్తంభమును ఆధారమునైయున్నది" (1 తిమోతి 3:14-16).

దేవుని ప్రజలు ఎక్కడ కూడుకొంటారో అక్కడ యేసు తప్పక ఉంటాడు. "ఏలయనగా, ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని చెప్పెను (మత్తయి 18:20). స్థానిక సంఘం "జీవము కలిగిన దేవుని నివాసము" దేవుని మీద గౌరవ మర్యాదలతో ఆరాధించుచున్న వారి మధ్యలో యేసు ప్రభువు అధ్యక్షునిగా ఉంటాడు. స్థానిక సంఘము అనే ఆ ఇంటికి యేసు ప్రభువే యజమానుడు. "అయితే క్రీస్తు కుమరుడైయుండి, ఆయన ఇంటి మీద నమ్మకముగా ఉన్నాడు; మనమే ఆయన ఇల్లు" (హెబ్రీ 3:1-6). సంఘము అనే ఆయన శరీరానికి పునాది ఆయనే అది "జీవముగల దేవుని సంఘము, అది సత్యమునకు స్థంభమును, ఆధారమునైయున్నది (1తిమోతి 3:14-16)". దాని స్తంభము మరియు ఆధారము క్రీస్తు అనబడిన పునాది మీద ఆధారపడి ఉన్నాయి. ఎందుకంటే; "నేను సంఘమును కట్టుదును" (మత్తయి 16:13-16) అని యేసు ప్రభువు చెప్పాడు. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడునూ వేయనేరడు, ఈ పునాది క్రీస్తే" (1 కొరింథీ 3:11)

“నిరాక్షేపముగా దైవ భక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది. అయిన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యేను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను, రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను” (1 తిమోతీ 3:16)

1. ఆయన కన్యకకు జన్మించాడు. ఎందుకంటే “ఆయన శరీరంతో ప్రత్యక్షమయ్యాడు.
2. ఆయన పరిపూర్ణమైన జీవితం, పాపరహితుడుగా ఉండటం, మానవాళి రక్షణ కోసం సిలువపై మరణించబోతున్నాడని తండ్రి యెదుట నీతిమంతుడని “ఆత్మలో సాక్ష్యం పొందాడు”.
3. దేవదూతలు ఆయనను చూశారు మరియు ఆయనకు పరిచర్య చేశారు (మత్తయి 4:11)
4. ఈ అద్భుతమైన సువార్త ఎప్పుడైతే ప్రకటించబడిందో “ప్రపంచం దానిని నమ్మింది”.
5. ఆయన మరణించి, మూడవ దినాన పునరుత్థానుడై తిరిగిలేచి పరలోకానికి మహిమతో ఆరోహణమై వెళ్ళడం శిష్యులు చూశారు.

‘దైవభక్తి యొక్క మర్మము ఏమిటంటే; క్రీస్తు శరీర రూపంలో కనిపించాడు. మనలో ఉన్న ఆయన ఆత్మ మనం దైవభక్తితో జీవించేలా బలపరచి మార్పు పొందిన జీవితాల ద్వారా అగపడతాడు.

## ఆయన గృహములోనికి ప్రవేశం, అందులో ఆరాధించడం.

యేసు చెప్పెను, “నేనే ద్వారమును” (యోహాను 10:7–9). ఆయన ఇంటిలో పాలిభాగస్థులు కావాలంటే అందరూ యేసు ద్వారా మాత్రమే లోపలికి రావాలి.

**ఇది ‘విశ్వాస’ గృహం:** “కాబట్టి మనకు సమయం దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా “విశ్వాస గృహమునకు” చేరిన వారి యెడలను మేలు చేయుదము” (గలతీ 6:10). మనము రక్షింపబడుటకు మరియు నిత్యజీవమనే బహుమానమును పొందుటకు విశ్వాసము ద్వారా ఆయన గృహములోనికి ప్రవేశిస్తాము (యోహాను 10). అది ఆత్మీయులతో నిండియున్న ఆధ్యాత్మిక గృహం.

1. వారు ప్రత్యేకించబడిన పరిశుద్ధ యాజకులు. ఎందుకంటే వారిలోని పరిశుద్ధాత్మ మరియు క్రీస్తు యొక్క విలువైన రక్తం వారిని శుద్ధీకరించింది. (1 పేతురు 2:1–5).
2. వారు రాజులైన యాజక సమూహం. ఎందుకంటే రాజులకు రాజైన యేసు ప్రభువు

సొత్తైన ప్రజలు (1 పేతురు 2:9). నూతన జన్మము ద్వారా దేవుని పిల్లలుగా మార్చబడ్డారు (యోహాను 1:11-13) మరియు దత్తత ద్వారా దేవుని కుమారులయ్యారు (రోమా 8:15-16). విశ్వాసులకు క్రీస్తులో అద్భుతమైన స్థితివుంది. "మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవమునైన రాయియగు ప్రభువునొద్దకు వచ్చినవారై, యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధయాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు" (1 పేతురు 2:4-5)

విశ్వసించే వారందరూ క్రీస్తు శరీరంగా ఏర్పరచబడతారు. "కాబట్టి మీరికమీదట పరజనులను పరదేశులునైయుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని ఇంటివారునైయున్నారు" (ఎఫెసీ 2:19)

**ఆయన గృహము యొక్క పవిత్రతను కాపాడాలి.**

1. **ఇది పరిశుద్ధ దేవాలయం, దేవుని నివాస స్థలం :** "ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది" (ఎఫేసీ 2:21)
2. **దేవుని పిల్లలకు పరిశుద్ధత ఒక గుర్తుగా ఉండాలి:** "నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును పరిశుద్ధులైయుండడుని వ్రాయబడియున్నది, కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞాన దశలో మీకుండిన ఆశలననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి (1 పేతురు 1:14-16).

"నీ శాసనములు ఎన్నడును తప్పిపోవు. యెహోవా, ఎన్నటెన్నటికి పరిశుద్ధతయే నీ మందిరమునకు అనుకూలము" (కీర్తన 93:5)

**అపరిశుభ్రమైన పాత్రల నుండి వేరుచేడానికి పిలుపు:** "అయినను దేవుని యొక్క స్థిరమైన పునాది నిలకడగా ఉన్నది. **ప్రభువు** తన వారిని ఎరుగును అనునదియు **ప్రభువు** నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతి నుండి తొలగిపోవలెను అనునది. గొప్ప ఇంటిలో వెండి పాత్రలును, బంగారు పాత్రలును మాత్రమే గాక కఱ్ఱవియు మంటిదియు కూడా ఉండును. వాటిలో కొన్ని ఘనతకును కొన్ని ఘనహీనతకును వినియోగింపబడును. ఎవడైనను వీటిలో చేరక తన్నుతాను పవిత్రపరచుకొనిన యెడల వాడు పరిశ్ధుపరచబడి,

యజమానుడు వాడుకొనుటకు అర్హమై ప్రతి సత్కార్యమునకు సిద్ధపరచబడి, ఘనత నిమిత్తమైన పాత్రయైయుండును" (2 తిమోతి 2:19-21). ఇది పరిశుభ్రమైన మరియు అపరిశుభ్రమైన పాత్రలతో కూడిన 'గొప్ప ఇల్లు'. అపవిత్రమైన విషయాలను ఆచరించే విశ్వాసుల నుండి మనము వేరవ్వాలి.

**దేవుని పిల్లల కొరకు ఆయన పిలుపు:** "కావున మీరు వారి మధ్య నుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి; అపవిత్రమైన దానిని ముట్టకూడిదని ప్రభువు చెప్పుచున్నాడు మరియు నేను మిమ్మును చేర్చుకొందును, మీకు తండ్రినైయుందును, మీరు నాకు కుమారులును కుమార్తెలునైయుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుచున్నాడు" (2 కొరింథీ 6:17-18).

మన దేహాలు పరిశుద్ధాత్మకు ఆలయం (1 కొరింథీ 6:19-20). వ్యభిచారం, కామవికారం లేదా ఇతర అపరిశుభ్రమైన అభ్యాసాల ద్వారా మనము ఈ ఆలయాలను అపవిత్రం చేయకూడదు. ప్రపంచానికి సువార్తను తీసుకెళ్ళడానికి మనం శుభ్రమైన పాత్రలుగా ఉండాలి. (యెషయా 52:11)

విశ్వసించే మనము శాశ్వతమైన పరిణామాలు మరియు శాశ్వతమైన బహుమతులతో కూడిన సందేశాన్ని మరియు బాధ్యతలను కలిగి ఉన్నాము.

## ఆయన గృహం యొక్క ఉద్దేశ్యం

ఇది ప్రార్థనా మందిరం : "నా మందిరము ప్రార్థనా మందిరమనబడునని వ్రాయబడి యున్నది. అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడివారనెను" (మత్తయి 21:13). స్థానిక సంఘం ప్రార్థన, ప్రభువు రాత్రి భోజనం మరియు బోధన కోసం కలుసుకోవడంలో విఫలమైతే అది చాలా విచారకరం. మొదటి శతాబ్దపు క్రైస్తవులు ఈ **విషయాల్లో చాలా నమ్మకస్థులు:** "వారు అపోస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుటయందును ఎడతెగకయుండిరి" (అ.పో.కా 2:42). **ప్రేరేపిత లేఖనాలు పేర్కొంటున్నాయి:** "ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా అలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:25)

**ప్రార్థన అనేది అపోస్తలుల యొక్క 'ప్రధమ' ప్రాధాన్యత. ప్రార్థన చేయవలసిన విషయాలు:** "మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి నెమ్మదిగాను సుఖముగాను బ్రతుకు

నిమిత్తము, అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరి కొరకును, రాజుల కొరకును, అధికారులందరి కొరకును విజ్ఞాపములును, యాచనలును, కృతజ్ఞతాస్తుతులును, చేయవలెనని హెచ్చరించుచున్నాను" (1 తిమోతి 2:1–2)

దేవుని కుటుంబ సభ్యులనుండి ఆయన కోరుకొనేది ఏమిటి: "ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను, ఆరాధింపవలెను, తనను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు" (యోహాను 4:23).

వ్యక్తిగతంగా మరియు సమిష్టిగా, 'ఆత్మతో మరియు సత్యముతో ఆరాధించడం మరియు మన ప్రభువుతో పవిత్రంగా నడవడం అనేది నిజమైన విశ్వాసుల మొదటి కర్తవ్యం.

## దేవుని ఇంటిపై గొప్ప ప్రధాన యాజకుడు

"దేవుని ఇంటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములుగలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములుగలవారమునైయుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము" (హెబ్రీ 10:21–22)

కల్వరిలో క్రీస్తు మన కొరకు చేసిన దానిని బట్టి మనము సంతోషిస్తున్నాము: "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడైయున్నాడు" (హెబ్రీ 7:25). మన గొప్ప ప్రధాన యాజకుడు పరలోకములో కూర్చొని, మన ప్రతి అవసరాన్ని తీర్చడానికి మనకోసం విజ్ఞాపనము చేయుచున్నాడు.

**సంపూర్ణమైన "దేవుని గృహం":** త్వరలో ఒక రోజు, దేవుని ఇల్లు అనేది స్థానిక సంఘంగా ఉండదు: కానీ ఆయన శరీరంగా సంఘం సంపూర్తి అవుతుంది మరియు ఆయన పరిపూర్ణ వధువుగా క్రీస్తుకు సమర్పించబడుతుంది (ఎఫెసీ 5:25–27)

"ఆయనను స్తుతించుడి, గొర్రెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది, ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొనియున్నది; గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమపరచెదమని చెప్పగా వింటిని" (ప్రకటన 19:7)

## అధ్యాయం-8

# ప్రభువు రాకడ

మన ప్రభువు తన ప్రజల కోసం రావడం అనే విషయం దేవుని వాక్యంలో వాగ్దానం చేయబడిన అత్యంత అద్భుతమైన సంఘటనలలో ఒకటి. ఇది ఒక క్షణంలో జరుగుతుంది మరియు అది ఆయన మహిమాయుక్తమైన సన్నిధిలోకి మనలను ప్రవేశపెడుతుంది. దీని కోసం మనం జీవించుచూ ఏ క్షణములోనైనా సంభవించునని ఎదురుచూడాలి. ఆయనకు నమ్మకంగా సేవ చేయాలనే ఉత్సాహంతో అది మనలను ప్రేరేపించాలి.

**మనము ఎలా ఉండాలి:** "మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు, ఈ లోకంలో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది. ఆయన సమస్తమైన దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్ క్రియలయందు ఆసక్తి గల ప్రజలను తన కోసము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మన కొరకు అర్పించుకొనెను" (తీతుకు2:13-14).

**మనము పరలోకం కోసం జీవించాలి:** "మన పౌర స్థితి పరలోకమందున్నది; అక్కడి నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తిని బట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగలదానిగా మార్చును" (ఫిలిప్పీ 3:20-21).

**అప్పుడు మనము ఆయనవలె ఉంటాము:** "ప్రియులారా, ఇప్పుడు మనము దేవుని పిల్లలమైయున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంకా ప్రత్యక్షపరచబడలేదు గానీ ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన ఉన్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము" (1 యోహాను 3:2).

**ఆయన తన ప్రజల కోసము వస్తున్నాడు:** "మీ హృదయములను కలవరపడనియ్యకుడి; దేవునియందు విశ్వాసముంచుచున్నారు నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి ఇంట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్దపరచిన యెడల నేనుండు స్థలములో

మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద ఉండుటకు మిమ్మును తీసుకొనిపోవుదును" (యోహాను 14:1-3)

అపోస్థలుడైన పౌలు కూడా దీనినే బోధించాడు: "యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మిన యెడల, అదేప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడా వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడ వరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటె ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడా ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము" (1 థెస్స 4:14-17)

**1 కొరింథీ 15వ అధ్యాయంలో ఇలా చదువుతాము:** "ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను. మనమందరము నిద్రించము గాని, నిమిషములో ఒక రెప్పపాటున కడబూర మ్రోగగానే మనమందరము మార్పుపొందుదుము. బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేవబడుదురు. మనము మార్పు పొందుదుము" (1 కొరింథీ 15:51-52).

**దీని నుండి మనము నేర్చుకొనేది ఏమిటి:** క్రైస్తవులు ఎప్పుడైతే చనిపోతారో అప్పుడు వారి శరీరాలు మట్టిలో పాతిపెట్టబడి దానిలోనే కలసిపోతాయి. అయితే వారి ప్రాణాత్మలు ప్రభువు దగ్గరకు చేర్చబడి ఆయన సహవాసంలో ఆనందంగా ఉంటాయి (2 కొరింథీ 5:8). ప్రభువు తిరిగి వచ్చినప్పుడు ఆయనయందుండి మృతులైన వారు మొదట లేతురు. అప్పటికి సజీవులైన విశ్వాసులు ఒక్క క్షణంలోనే రూపాంతరం చెంది వారితో కలసి ప్రభువును ఎదుర్కోవడానికి మేఘాల మీదికి కొనిపోబడుదురు లేదా ఎత్తబడుదురు. ప్రభువును మనము ఎప్పుడైతే చూస్తామో అప్పుడు మనము ఆయన వలే రూపాంతరం చెంది ఆయనతో సదాకాలం జీవించియుంటాము.

**ఆయన తన ప్రజలకు తీర్పు తీర్చును:**

'ఎత్తబడిన' తర్వాత మనము 'సమీక్ష' మరియు 'బహుమానము కోసమై క్రీస్తు యొక్క న్యాయ పీఠానికి" వెళతాము. మన పాపములను బట్టి కాదు గానీ, మన సేవ,

ఉద్దేశాలు మరియు మన వైఖరులను, మంచివా లేదా చెడ్డవా అనే విషయాలను బట్టి శరీరంలో చేసిన పనులను సమీక్షించడం కోసం మనమందరం మన ప్రభువు ముందు నిలబడాలి, అప్పుడు ఆయన తన ప్రజలకు ప్రతిఫలమిస్తాడు, ఎందుకంటే మనము ఆయనను నమ్మకంగా అనుసరించినట్లయితే మనము గెలుచుకునే కిరీటాలు ఆయన దగ్గర ఉన్నాయి.

బైబిల్ ఈవిధంగా సెలవిస్తుంది: "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:6–11). ఇది మన పాపముల నిమిత్తం జరిగే తీర్పు కాదు. ఎందుకంటే కల్వరి సిలువలో యేసు ప్రభువు మన పాపముల నిమిత్తం వెల చెల్లించి మనలను పాప విముక్తులుగా చేశాడు. యేసు చెప్పెను "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 5:24). కాబట్టి, ఆయన ప్రజలు గొఱ్ఱెపిల్ల వివాహ విందులో ఆనందించడానికి సిద్ధపడతారు (ప్రకటన 19:7–10). ప్రస్తుత సాక్ష్యం మరియు భవిష్యత్‌లో బహుమానం పొందకుండా తాను అనర్హుడనవుతానేమో అని దీని దృష్ట్యా అపోస్థలుడైన పౌలు తన శరీరాన్ని క్రమశిక్షణలో పెట్టుకున్నాడు (1 కొరింథీ 9:24–27).

## ఆయన తన ప్రజలతో రానైయున్నాడు:

ప్రపంచాన్ని నీతితో తీర్పు తీర్చడానికి మరియు భూమిపై తన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రభువు తన ప్రజలతో భూమికి తిరిగి వస్తాడు. (ప్రకటన 19:11–21, ప్రకటన 20వ అధ్యాయం (ఆయన వచ్చినప్పుడు తన పాదము యెరూషలేంలోని ఒలీవల కొండపై మోపుతాడు) ఇశ్రాయేలీయుల పశ్చాత్తాపము మరియు ఆ రోజు భూమిని చలింపజేసే సంఘటనల కోసం, (జెకర్యా 12 నుండి 14 అధ్యయాలు చదవండి).

ఈ భయంకరమైన 'యెహోవా దినమును' గూర్చి అనేక లేఖన భాగాలలో ప్రస్తావించబడింది. (యోవేలు 2:31–32). "ఎందుకనగా; తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి ఒక దినమును

నిర్ణయించియున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపినందున దీన్ని నమ్ముటకు అందరికినీ ఆధారము కలుగజేసియున్నాడు" (అ.పో.కా. 17:31)

ఆయన తన ప్రజల కోసం వచ్చినప్పుడు మనము ఆయనను ఆకాశ మండలములో కలుసుకొంటాము. ఆయన తన ప్రజలతో ఈ భూమి మీదకు వచ్చినప్పుడు తన పాదమును యెరూషలేములో ఉన్న ఒలీవల కొండపై మోపుతాడు.

**ఈ సంఘటనలు సమీక్షించడం:**

ప్రభువైన యేసుక్రీస్తు తన శిష్యులకు ఆకాశమండలములో తన రాకడ గురించి బోధించాడు (యోహాను 14:1-3). ప్రతిసారి ప్రభువు బల్లలో మనం పాల్గొంటున్నప్పుడు "ఆయన వచ్చునంత వరకు ఆయన మరణమును ప్రచురించుదుము" (1 కొరింథీ 11:26) యేసు ప్రభువు ఏ క్షణానైనా మరలా వచ్చునని సంఘము వేచి చూడాలి (1 థెస్స 1:9-10). దీని తర్వాత ఏడు సంవత్సరాల పాటు మహా శ్రమలు కొనసాగుతాయి, దీనిని యాకోబు లేదా ఇశ్రాయేలు యొక్క ఆపద సమయం అని పిలుస్తారు. (యిర్మియా 30 అధ్యాయం; దానియేలు 9:24-27, మత్తయి అధ్యాయం 24; ప్రక. 7:13-14 చూడండి) విశ్వాసులు పరలోకములో క్రీస్తు న్యాయపీఠం వద్ద ఉంటారు. అప్పుడు ప్రభువు తన పరిశుద్ధులతో ఆర్భాటముతో మహా మహిమతో భూమికి తిరిగి వస్తాడు మరియు ఆయన వెయ్యేండ్ల పాలనను స్థాపిస్తాడు. ఆ తర్వాత దుష్టుల పునరుత్థానం మరియు తీర్పు జరుగుతుంది, ఆపై విశ్వాసులకు పరలోకము శాశ్వతమైన స్థితి ఉంటుంది (ప్రకటన 19 నుండి 22 అధ్యాయాలు చదవండి).

మన ప్రభువైన యేసు తన శిష్యులకు తాను ఇచ్చిన తలాంతులను ఉపయోగించమని మరియు "ఆయన వచ్చే వరకు వ్యాపారం చేయమని" బోధించాడు (లూకా 19:13). అనేక ఉపమానాలు శిష్యులకు ఏ క్షణములోనైనా ఆయన ప్రత్యక్షతకు సిద్ధంగా ఉండాలని బోధించాయి.

ప్రభువును సేవిస్తూ, ఆయన ప్రజలను కలుసుకుంటూ, ఆయన రాక కోసం ఎదురుచూస్తూ ఆయన పనిలో నిమగ్నమై ఉందాం.

# పరిశుద్ధాత్మ

ఆయన వ్యక్తిత్వం మరియు పని

ఆల్బర్ట్ ఫెయిర్ వెథర్ యొక్క అధ్యయనం

బాప్తీస్మం, పరిశుద్ధాత్మ, ప్రవచనం, భాషలు మాట్లాడుట

స్వస్థతలను గూర్చి

## ప్రశ్నలు - జవాబులు

"మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు. నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడునుండుటకై ఆయన వేరొక ఆదరకర్తను, అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును" (యోహాను 14:15-16).

## పరిశుద్ధాత్మ యొక్క వ్యక్తిత్వం మరియు పని

ఈరోజుల్లో పరిశుద్ధాత్ముని యొక్క వ్యక్తిత్వం మరియు ఆయన పనిని గూర్చి చాలా మందిలో గందరగోళం నెలకొనియుంది. "పరిశుద్ధాత్మ ఎవరు", "పరిశుద్ధాత్మలో బాప్తీస్మం", "ప్రవచించడం", "భాషలలో మాట్లాడడం" మరియు "స్వస్థత" అనే విషయాలపై ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రభువైన యేసుక్రీస్తు తన శిష్యులకు పరిశుద్ధాత్మ ఆగమనం మరియు పరిచర్య గురించి బోధించాడు: "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును, మీలో ఉండును. మిమ్మును అనాధలనుగా విడువను, మీ యొద్దకు వత్తును, కొంతకాలమైన తరువాత లోకము నన్ను మరి ఎన్నడును చూడదు" (యోహాను 14:16-18).

పరిశుద్ధాత్మ వచ్చి ఏమి చేస్తాడో అనే విషయాన్ని యేసుక్రీస్తు చెప్పాడు: "పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించును" (యోహాను 14:26), "ఆయన (పరిశుద్ధాత్మ) యేసుక్రీస్తుని గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:26), "పరిశుద్ధాత్మ వచ్చి పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయును", "ఆయన సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును మరియు నన్ను మహిమపరచును" (యోహాను 16:7-15). కాబట్టి, దీని నుండి మనం

నేర్చుకొనేది ఏమిటంటే.

1. యేసుక్రీస్తు యొక్క ప్రార్థనలకు జవాబు తండ్రియైన దేవుడు పరిశుద్ధాత్మను ఈలోకానికి పంపియున్నాడు. పరిశుద్ధాత్మను "సహాయకుడు" లేదా "ఆదరణ కర్త" అని కూడా పిలుస్తారు.
2. పరిశుద్ధాత్మ ఒక ప్రభావం కాదు. ఆయన ఒక వ్యక్తి. ఆయన "సత్యమైయున్న ఆత్మ". ప్రపంచం ఆయనను తెలుసుకోదు, చూడదు మరియు స్వీకరించదు.
3. శిష్యులు ఆయనను తెలుసుకుంటారు, ఎందుకంటే యేసుక్రీస్తు మాట్లాడినట్లు ఆయన 'వారితో' ఉన్నాడు మరియు ఆ తర్వాత 'వారిలో' ఉండి 'ఎప్పటికీ వారితో ఉంటాడు'.
4. పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పింపజేసే పరిచర్యను ఆయన కలిగియుంటాడు.
5. విశ్వాసుల మధ్య క్రీస్తును మహిమపరిచే పరిచర్యను ఆయన కలిగియుంటాడు.

## తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ

'త్రిత్వం' అనే పదం బైబిల్లో కనిపించకపోయినప్పటికీ, త్రిత్వ సిద్ధాంతం లేక బోధ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. దీన్ని గూర్చి యేసుప్రభువు ఏమి చెప్పాడో ఒకసారి గమనించండి: "యేసు వారియొద్దకు వచ్చి పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి భాప్తిస్మమిచ్చుచు, నేను మీకు యేయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20). మూడు వ్యక్తిత్వాలు కలగలసి ఐక్యంగా ఉన్న ఒకే దేవుని నామంలో మనం బాప్తీస్మము ఇవ్వాలి.

యేసుక్రీస్తు ప్రభువు యొక్క బాప్తీస్మ సమయంలో కూడా త్రిత్వాన్ని మనం చూస్తాము. ప్రభువు బాప్తీస్మం తీసుకొన్నప్పుడు పరిశుద్ధాత్ముడు పావురమువలె ఆయన మీదికి దిగి రాగా, తండ్రి స్వరం ఆకాశము నుండి వినిపించడం మనం గమనించవచ్చు. (మత్తయి 3:13:17). హెబ్రీ 9:14లో కూడా త్రిత్వాన్ని మనము చూడవచ్చు. అందరూ కలసి మన రక్షణ కొరకు చేసిన కార్యాన్ని మనం గమనించవచ్చు. "నిత్యుడగు ఆత్మ ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ

క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మన మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును".

యేసుక్రీస్తు మరియు పరిశుద్ధాత్మ దైవత్వాన్ని గూర్చి, ఆ ఇరువురిని మన మధ్యలోకి పంపినది తండ్రియైన దేవుడు అని బైబిల్ మనకి స్పష్టంగా బోధిస్తుంది. "తండ్రి తన కుమారుని లోక రక్షకుడుగా ఉండుటకు పంపియుండుట మేము చూచి సాక్ష్యమిచుచున్నాము" (1 యోహాను 4:14). "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడునుండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును" (యోహాను 14:16), "తండ్రి యొద్ద నుండి బయలుదేరువాడు (యోహాను 15:26).

## పరిశుద్ధాత్మ దేవుడు మరియు ప్రభువు

పేతురు కూడా పరిశుద్ధాత్మ యొక్క – దైవత్వాన్ని అర్థం చేసుకున్నాడు. "అప్పుడు పేతురు అననియా, పరిశుద్ధాత్మను మోసపుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను? నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధమాడితివని వానితో చెప్పెను" (అ.పో.కా 5:1–5). "నిత్యుడగు ఆత్మ" (హెబ్రీ 9:14), "జీవమిచ్చు ఆత్మ" (రోమా 8:2). "సత్య స్వరూపియగు ఆత్మ" వంటి ఇంకా అనేక పేర్లతో పరిశుద్ధాత్ముడు బైబిల్ గ్రంథంలో ప్రస్తావించబడ్డాడు. ఈ పేర్లన్నీ త్రియేక దేవుడైన తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ యొక్క లక్షణాలను సూచిస్తాయి.

## పరిశుద్ధాత్మ దేవునికి వ్యక్తిత్వం ఉంది, ఆయన అబద్దాన్ని గుర్తిస్తాడు. దుఃఖిస్తాడు, ఆర్పివేయబడతాడు:

తండ్రి కుమారునితో పాటుగా పరిశుద్ధాత్ముడు ఉన్నాడని బైబిల్ మనకు స్పష్టంగా బోధిస్తుంది. "ప్రభువే ఆత్మ. ప్రభువు యొక్క ఆత్మ యొక్కడ ఉండునో అక్కడ స్వాతంత్ర్యము ఉండును" (2 కొరింథీ 3:17)

## యేసుక్రీస్తు దేవుడు మరియు ప్రభువు

"దేవుడు శరీరధారియై మన మధ్యకు వచ్చాడని యేసుక్రీస్తుని గూర్చి ప్రాచీనకాలం నుండి క్రైస్తవులు భావించారు" (1 తిమోతి 3:16). "ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1:22–23) (యెషయా 7:14).

కొత్త నిబంధనలో 80 కంటే ఎక్కువ సార్లు "యేసుక్రీస్తు ప్రభువు" అని ప్రస్తావించబడింది. ప్రభువు అనే మాటకు అర్థం దేవుడు అని తెలుపుతుంది: "అందుకు తోమా నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:28).

క్రీస్తు జన్మించడానికి 700 సంవత్సరాలకు ముందు యెషయా ప్రవక్త ఈవిధంగా రాశాడు: "ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను అయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6).

**కాబట్టి దీని నుండి మనం గ్రహించేది ఏమిటంటే, ఒక్కడే దేవుడు ఆయనలో మూడు వ్యక్తిత్వాలు ఇమిడియున్నాయి. ఆయన త్రియేక దేవుడు.**

## పరిశుద్ధాత్మను పంపడం

యేసు ప్రభువు మహిమపరచబడే వరకు పరిశుద్ధాత్మ పంపబడలేదని గమనించడం ముఖ్యం: "తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపర్చబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడియుండలేదు" (యోహాను 7:39). యేసు మరణించి, పాతిపెట్టబడి, మూడవ దినాన పునరుత్థానుడై తిరిగి లేచి పరలోకానికి ఆరోహణుడై వెళ్ళిపోవడానికి ముందు 40 దినాలు శిష్యులకు బోధిస్తూ ఉండెను (అ.పో.కా 1వ అధ్యాయం). అప్పుడు ఆయన తండ్రిని ప్రార్థించగా, ఆయన పునరుత్థానం తర్వాత 50 రోజులకు పెంతెకోస్తు పండుగలో పరలోకము నుండి పరిశుద్ధాత్మ పంపబడెను (అ.పో.కా 2వ అధ్యాయం). యేసుప్రభువు చెప్పినట్లుగా, పెంతెకోస్తు పండుగ దినాన (క్రొత్తగా) సంఘము స్థాపించబడింది. "ఈ బండ మీద నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:18). ఆయన ఈ మాటలు భవిష్యత్‌లో జరిగే విషయాన్ని గూర్చి చెప్పాడు.

పరిశుద్ధాత్మ రాకను గూర్చి యోహాను ముందే ప్రవచించాడు. "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు భాప్తిస్మమిచ్చుచున్నాను; అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నాకంటే శక్తిమంతుడు; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను; ఆయన పరిశుద్ధాత్మలోనూ, అగ్నితోనూ మీకు బాప్తీస్మమిచ్చును" (మత్తయి 3:11).

పెంతెకోస్తు దినాన నెరవేరిన ఈ వాగ్దానాన్నే ప్రభువైన యేసు తన శిష్యులకు గుర్తు చేశాడు (లూకా 24:49) (అ.పో.కా. 1:4-5).

అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి ఒక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న ఇల్లంతయు నిండెను మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్లుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగా అందరూ పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్య భాషలతో మాటలాడసాగిరి (అ.పో.కా 2:1-4)

ఇది సంఘము యొక్క పుట్టినరోజు, ఒకసారి మాత్రమే జరిగిన సంఘటన, ఇది మళ్ళీ ఎప్పుడూ పునరావృతం కాదు. ఒకే ఒక్క బాప్తీస్మం ఉంది. "శరీరం ఒక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారము మీ పిలుపు విషయమై ఒక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసం ఒక్కటే, బాప్తీస్మం ఒక్కటే, అందరికినీ తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికీ పైగా ఉన్నవాడై అందరిలోనూ వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫేసీ 4:4-6)

**క్రీస్తు ప్రార్థనకు సమాధానంగా, తండ్రి పరిశుద్ధాత్మను పంపాడు, ఆయన వచ్చి శిష్యులందరికీ బాప్తీస్మం ఇచ్చాడు. అదే సంఘము.**

## పరిశుద్ధాత్మలో బాప్తీస్మం.

"పరిశుద్ధాత్మ యొక్క బాప్తీస్మం"లో విశ్వాసులు బాప్తీస్మం పొందారని బోధించడం తప్పు. పరిశుద్ధాత్మలో బాప్తీస్మం పొందడం కాదు. పరిశుద్ధాత్మయే బాప్తీస్మమిచ్చువాడు. పెంతెకోస్తు దినాన శిష్యులందరికీ ఒక్క శరీరంగా (ఒక్క శరీరంలోకి) బాప్తీస్మమిచ్చి సంఘాన్ని స్థాపించింది ఆయనే. "ఏలయనగా, యూదులమైనను, గ్రీసు దేశస్థులమైనను, దాసులమైనను, స్వతంత్రులమైనను, మనమందరము ఒక్క శరీరంలోనికి (ఒక్క శరీరంగా ఉండుటకు) ఒక్క ఆత్మయందే బాప్తీస్మం పొందితిమి. మనమందరము ఒక్క ఆత్మను పానము చేసినవారమైతిమి" (1 కొరింథీ 12:13)

గ్రీకు భాషలో "మనమందరము బాప్తీస్మం పొందేము" అనేది భూతకాలంలో ఉంది. అది సంపూర్ణంగా జరిగిపోయిన సంఘటన. కాబట్టి, అది మళ్ళీ ఎన్నడూ పునరావృతం కాదు. సంఘం అనేది పెంతెకోస్తు పండుగనాడు ఏర్పడినప్పటి నుండి, ప్రభువైన యేసు తన ప్రజలను పరలోకానికి తీసుకెళ్ళే రోజు వరకు విశ్వాసులందరితో 'ఒక్క శరీరంగా' రూపొందిచబడినది (యోహాను 14:1-3).

మారుమనస్సు సమయంలో, ప్రతి విశ్వాసి దీని యొక్క సంరక్షణలోనికి వచ్చి,

క్రీస్తు శరీరంలో భాగమై అతడు సంఘములో సభ్యుడు అవుతాడు. ఇది పరిశుద్ధాత్ముడు మనలో జరిగించు కార్యమే గాని ఏదో ఒక అనుభవం కాదు.

యేసు ప్రభువు పేతురుకు ఈవిధంగా చెప్పాడు. "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను" (మత్తయి 16:18-19). తలుపులు తెరవడానికి తాళపు చెవులు ఉపయోగించబడతాయి. మొట్టమొదటిగా యూదులకు (అ.పో.కా 2:14-47); తరువాత సమరయులకు (అ.పో.కా 8:14-17); తర్వాత అన్యులకు (అ.పో.కా 10:1-48) పరలోక రాజ్యానికి తలుపులు తెరవడానికి దేవుడు పేతురును ఉపయోగించుకున్నాడు.

ఒక నగరం విస్తరిస్తున్నప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రాంతాల్లో నీటి సరఫరా కోసం కొత్త పైపు లైన్లు పూర్వపు పెద్ద పైపు లైన్లకి అనుసంధానం చేయబడినట్లుగా, ప్రభువు పరలోక రాజ్యాన్ని కొత్త ప్రాంతాలకు అపోస్తలులు మరియు సంఘం ద్వారా ఎలా విస్తరింపజేస్తున్నాడో అపోస్థలుల కార్యముల గ్రంథంలో చాలా స్పష్టంగా మనం చూస్తాము.

చివరికి, అపోస్తలుడైన పౌలు కూడా బాప్తీస్మమిచ్చు యోహాను శిష్యులకు పరలోక రాజ్యమును వ్యాప్తి చెందించుటకొరకు వాడుకోబడ్డాడు (అ.పో.కా 19:1-7). ఈ మనుష్యులకు యేసు ప్రభువును గూర్చి చాలా తక్కువ తెలుసు. అసలు పరిశుద్ధాత్ముడు ఉన్నాడనే సంగతే వీరికి తెలియదు. పాపక్షమాపణ నిమిత్తం ఇవ్వబడిన యోహాను బాప్తీస్మమును గూర్చి మాత్రమే వారికి తెలుసు. దేవుని క్రమంలో ఇది మొదట యూదులకు, అక్కడే శరీరం లేదా సంఘము మొదటిగా ప్రారంభమైంది. ఆ తర్వాత మతపరమైన అడ్డంకులను అధిగమించి సమరయుల వరకు సంఘము విస్తరించింది. ఆ తర్వాత జాతిపరమైన అడ్డంకులను అధిగమించి సంఘము అన్యుల వరకు విస్తరించింది.

చివరిగా, యోహాను శిష్యులకు సువార్త ప్రకటన మరియు పరిశుద్ధాత్మను గూర్చి చెప్పడం వలన ధర్మశాస్త్ర సంబంధమైన ఆచారాలు, నియమాలు దాటుకొని క్రొత్త నిబంధన సంఘములోకి వారు తీసుకొనిరాబడ్డారు.

ఇప్పుడు సంఘ యుగం, అనగా కృపాయుగంలో, విశ్వసించే వారందరూ ఒకే శరీరంలోకి ఒకే ఆత్మ ద్వారా భాప్తీస్మం పొందుతారు. అది మతపరమైన, జాతిపరమైన మరియు కాలపరమైన అడ్డంకులను ఎంతగా అధిగమించిన ఎంత అద్భుతమైన ఐక్యత కలిగిన సంఘము కదా! నిజముగా "ఒకే శరీరం" మాత్రమే ఉంది (ఎఫెసీ 4:5)

## పరిశుద్ధాత్మ నింపుదల

పరిశుద్ధాత్మ అంటే 'సహాయకుడు' లేదా 'ఆదరణకర్త'. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన 'సహాయం చేయడానికి పక్కనే ఉండేవాడు'. శిష్యుల జీవితాల్లోని అన్ని పరిస్థితుల్లో సహయం చేయడానికి పరిశుద్ధాత్ముడు పంపబడతాడు. ప్రభువైన యేసు తన శిష్యులతో ఉన్నప్పుడు "సహాయకుడు"గానూ మరియు "ఆదరణకర్త"గానూ వారితో ఉన్నాడు. ఆయన వారిని అనాధలనుగా విడిచిపెట్టడు; ఆయన వారి వద్దకు పరిశుద్ధాత్మ వ్యక్తిగా భూమిపై తన స్థానాన్ని తీసికొనుటకు వస్తాడు (యోహాను 14:15-18).

రెండవ ఆశీర్వాదం అనగా మారుమనస్సు పొందిన తర్వాత కొన్ని అదనపు 'అతీంద్రియ' సంగతులు జరుగుతాయి అని మాట్లాడడం తప్పు. ఏక శరీరములోనికి ఆత్మ ద్వారా భాప్తీస్మం పొందడం మరియు పరిశుద్ధాత్మతో నింపబడడం మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేక కొంతమంది ప్రజలు గందరగోళానికి గురౌతున్నారు. "ఒకే ఒక బాప్తీస్మం" ఉంది. బైబిల్ ఈవిధంగా వుంది "శరీరం ఒక్కటే, ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై ఒక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసం ఒక్కటే, భాప్తీస్మం ఒక్కటే. అందరికీ తండ్రియైన దేవుడు ఒక్కడే, ఆయన అందరికీ పైగా ఉన్నవాడై అందరిలోనూ వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసీ 4:4-6).

పరిశుద్ధాత్మ యొక్క నింపుదలను గూర్చి అనేక సంఘటనలు ఉన్నాయి: పరిశుద్ధాత్మ పంపబడిన తర్వాత దేవుని సంఘము ఏకశరీరంగా ఏర్పడిన తర్వాత శిష్యులు పరిశుద్ధాత్మతో నింపబడ్డారు (అ.పో.కా 2:4; 4:8, 31; 9:17).

"ఆత్మ యొక్క మరొక బాప్తీస్మం" కోసం ప్రార్థించడం లేదా ఆశించడం బైబిల్లో ఎక్కడా ప్రస్తావించబడలేదు, కానీ పరిశుద్ధాత్మ నింపుదలను గూర్చి తరచుగా ప్రస్తావించబడింది. ఈ ఆత్మ నింపుదల గురించి బైబిల్ మనకు ఈవిధంగా చెబుతుంది. "మరియు మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు. అయితే ఆత్మపూర్ణులైయుండుడి" (ఎఫెసీ 5:18). గ్రీకు భాషలో దీని అర్థం 'నిరంతరం పరిశుద్ధాత్మ నింపుదలతో ఉండాలని ఆజ్ఞ:

మద్యం త్రాగిన వ్యక్తి కొంత సమయం మద్యము యొక్క ప్రభావంలో ఉంటాడు, అందువలన అతను మూర్ఖంగా ప్రవర్తిస్తాడు. దీనికి విరుద్ధంగా, పరిశుద్ధాత్మతో నిండిన వ్యక్తి భిన్నంగా ప్రవర్తిస్తాడు, అతని లేదా ఆమె జీవితంలో పరిశుద్ధాత్మ ప్రభావం మరియు

పరిశుద్ధాత్మ యొక్క ఆత్మ ఫలాన్ని చూపుతుంది; “అయితే ఆత్మ ఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు” (గలతీ 5:22-23).

“ఆత్మతో నింపబడాలని” (ఎఫేసీ. 5:18), “ఆత్మలో నడవాలని” (గలతీ. 5:16), “ఆత్మ చేత నడిపించబడాలని” (గలతీ. 5:18) మరియు మన జీవితాల్లో ఆత్మ ఫలము కనబర్చాలని మనకు ఆజ్ఞాపించబడినది.

**ఆత్మానుసారముగా నడుచుట**

బైబిల్ ఈవిధంగా కూడా చెప్తుంది; “మనము ఆత్మననుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందము” (గలతీ 5:25). ప్రతి విశ్వాసి నూతన జన్మ ద్వారా మరియు క్రీస్తు శరీరంలోకి పరిశుద్ధాత్మ ద్వారా బాప్తీస్మం పొందడం వలన ఆత్మ యొక్క అధీనంలో జీవిస్తాడు.

మనలో నివసించే పరిశుద్ధాత్మను మనం దుఃఖపరచవచ్చు మరియు ఆర్పివేయవచ్చును. అందువలన మనం ఖచ్చితంగా అనునిత్యం ఆత్మలో నడవాలని ఆజ్ఞాపించబడింది; “దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినము వరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు” (ఎఫేసీ 5:30). “ఆత్మను ఆర్పకుడి” (1 థెస్స 5:19).

మనము అవిధేయులైనప్పుడు, తప్పుడు నిర్ణయాలు తీసుకొన్నప్పుడు, స్వార్థపూరితమైన లేదా పాపభరితమైన జీవితాన్ని గడుపుతున్నప్పుడు, మనము పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తాము లేదా బాధపెడతాము. ఆయన సేవ చేయడానికి మరియు ఆయన కోసం జీవించడానికి మన హృదయాలలో ఆయన వెలిగించిన అగ్నిని ఆర్పివేస్తాము. నిజమైన యేసు అనుచరుడికి ఉండవలసిన శాంతి మరియు సంతోషం మనకు ఉండదు. ఆయన పేరు ‘పరిశుద్ధాత్మ’ కాబట్టి, ఆయన మన జీవితాలలో పరిశుద్ధతను కలిగించడానికి పని చేస్తాడు. ఆయన తన సేవలో శుభ్రమైన పాత్రలను కోరుకుంటున్నందు వలన, మనం పాపం చేస్తూనే ఉంటే, ఆయన మనలను ఉపయోగించుకోలేడు. మనము ఎన్నడూ ఆత్మ యొక్క బాప్తీస్మం కొరకు వెదకకూడదు, కానీ మనము ఆత్మతో నింపబడాలని కోరుకోవాలి. మారుమనస్సు సమయంలో దేవుడు

మన జీవితాల్లో జరిగించే పనియే ఆత్మ ద్వారా బాప్తీస్మం పొందటం. కానీ పరిశుద్ధాత్మతో నింపబడటం అంటే మన జీవితాల్లో ఆయన చిత్తానికి లొంగిపోవడం. అది మన దైనందిన జీవితంలో అవసరమైయున్నది.

## పరిశుద్ధాత్మకు లోబడుట

పరిశుద్ధాత్మ మన హృదయములోని ప్రతి గదిని ఆక్రమించాలని కోరుకుంటాడు. తరచుగా ఆయనకు ఆహ్వానం లేని గదులు మనలో ఉన్నాయి! ఈ గదులు తప్పుడు మరియు పాపపు ఆలోచనలు, క్షమించరాని ఆత్మ లేదా ప్రాపంచిక ఆశయాలు మరియు పాపపు పనులతో ఆక్రమించబడి ఉండవచ్చు. అన్నింటినీ ఆయనకు అప్పగించే వరకు పూర్తి ఆనందమును శాంతిని మనము తెలుసుకోలేము. "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (1 కొరింథీ 6:19-20)

పౌలు ఈ మాటలను నామకార్థ మరియు లోకసంబంధమైన క్రైస్తవుల కొరకు వ్రాస్తున్నాడు (1 కొరింథీ 3:1-3). ఈ సంఘము పాపాన్ని అనుమతిస్తున్నది. కొందరైతే విపరీతమైన పాపపు పనులు కూడా చేస్తున్నారు. వారు ఆత్మతో నింపబడినవారు కారు. ఎప్పుడైతే ఆయనను దుఃఖపరిచే కార్యాలు మనం చేస్తున్నామని గ్రహించామో అప్పుడే వాటిని ఆయన ఎదుట ఒప్పుకొని వాటిని విడిచిపెట్టాలి. బైబిల్ ఈవిధంగా సెలవిస్తుంది. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9). అప్పుడు మరల తన మహిమ నిమిత్తమై మనలను వాడుకొంటాడు.

అన్నింటిలో ఆయనకు లోబడుట ద్వారా ఈ పరిశుద్ధాత్మ నింపుదలను ఆస్వాదించడానికి ఇప్పుడు సమయం ఆసన్నమైంది. ఆయన ప్రతి ఒక్కరిపట్ల ఒక ప్రత్యేకమైన పనిని కలిగి ఉన్నాడు. ఆయన ఈ రోజు తన రాజ్యాన్ని ప్రజల మధ్య విస్తరిస్తుండగా ప్రభువు కోసం జీవించడంలో ఆనందం మరియు శాంతి ఉంది.

## మన "కోసం" మన"లో" పరిశుద్ధాత్మ యొక్క పని

నీటి బాప్తీస్మం క్రీస్తుతో మనకున్న అద్భుతమైన సంబంధాన్ని మరియు ఆయనలో

దాగి ఉన్న మన స్థానాన్ని తెలియజేస్తుంది. క్రీస్తు యేసులోనికి బాప్తీస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తీస్మం పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తీస్మం వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:14).

పరిశుద్ధాత్మ యొక్క పని ద్వారా, మనము క్రీస్తుతో గుర్తించబడ్డాము. తద్వారా పౌలు ఈవిధంగా చెప్పగలిగాడు: "నేను క్రీస్తుతో కూడా సిలువవేయబదియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను. క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాము" (గలతీ 2:20)

పౌలు మరియొక వచనంలో ఈవిధంగా కూడా చెప్పాడు: "మీరు క్రీస్తుతో కూడా లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి, అక్కడ క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్న వాటి మీదనే గానీ, భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకుడి. ఏలయనగా మీరు మృతిపొందితిరి, మీ జీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది" (కొలస్సీ 3:1-3)

ప్రతి విశ్వాసిలో దేవుడు చూసేదేమిటంటే?: క్రీస్తు మరణించినప్పుడు, మనము ఆయనలో మరణించాము; ఆయన సమాధి చేయబడినప్పుడు, మనము ఆయనతో సమాధి చేయబడ్డాము మరియు ఆయన లేచినప్పుడు, మనము ఆయనలో లేచాము. ఇందులో పరిశుద్ధాత్మ యొక్క ప్రాముఖ్యమైన పాత్రను చూడండి.

1. పరిశుద్ధాత్ముడు మన పాపములను గూర్చి మనలను ఒప్పింపజేశాడు. పశ్చాత్తాపాన్ని మరియు విశ్వాసాన్ని మనలో తీసుకొని వచ్చాడు (యోహాను 16:8-11)
2. పరిశుద్ధాత్మ ద్వారా మనము "నీళ్ళ మరియు ఆత్మతో తిరిగి జన్మించి దేవుని పిల్లలము గా చేయబడ్డాము (యోహాను 1:11-13, 3:5)
3. "దత్తపుత్రాత్మ" ద్వారా మనము దేవుని కుమారులుగా అంగీకరించబడ్డాము (రోమా 8:12-17)
4. "ఒక్క ఆత్మ ద్వారా మనము శరీరమనబడిన సంఘములోకి బాప్తీస్మం పొందియున్నాము". (1 కొరింథీ 12:13).

5. మనము “వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ చేత ముద్రించబడ్డాము”, ఇది భద్రత మరియు యాజమాన్యానికి చిహ్నం (ఎఫెసీ 1:13-14).
6. మనము “పరిశుద్ధాత్మచే పరిశుద్ధపరచబడ్డాము”, అనగా దేవుని ఉద్దేశాల కొరకు “ప్రత్యేకించబడినాము” (రోమా 15:16).

ఇది మనము దేవుని కనుదృష్టి యెదుట ‘ఆత్మ ఆధీనములో’ నివసించుట క్రీస్తు సిలువపై చేసిన పని ద్వారా మనలో నివసించే పరిశుద్ధాత్మ ద్వారా తండ్రి దృష్టిలో మనం క్రీస్తుతో శాశ్వతంగా గుర్తించబడ్డాము. దేవుడు మన కోసం ఎన్నో అద్భుతమైన పనులు చేసాడు. మనమిప్పుడు వాటిని పూర్తిగా అర్థం చేసుకోలేము. కానీ, రాబోయే నిత్యత్వంలో ఆయన ఎవరో మరియు ఆయన చేసిన దాని గురించి మనము ఎప్పటికీ ఆయనను స్తుతించి, ఆరాధిస్తాము.

## పాత నిబంధనలో పరిశుద్దాత్మ మరియు ఆయన వరములు

పాతనిబంధనలో పరిశుద్దాత్మ దేవుని ప్రజలతో ‘ఉన్నాడు’ మరియు ప్రత్యేక మార్గంలో దేవుణ్ణి సేవించేలా వారిని శక్తివంతం చేసేందుకు ఎంపిక చేసిన ‘వారిపైకి దిగి వచ్చాడు’ (న్యాయాధి 14:6; 15:14) (1 సమూ 10:6-10). ఆయన దావీదు పైకి వచ్చాడు. కానీ సౌలు రాజును విడిచిపెట్టాడు. (న్యాయాధిపతులు 16:20) (1 సమూయేలు 16:13-14).

దావీదు ఒక గొప్ప రాజు, ప్రవక్త మరియు ఇశ్రాయేలు యొక్క మధురమైన కీర్తనకారుడు అయ్యాడు. ఎందుకంటే అతనిపై పరిశుద్దాత్మ ఉన్నాడు. బత్షెబాతో చేసిన గొప్ప పాపం తర్వాత, ఆత్మ తనను విడిచిపెట్టి వెళ్ళిపోయే ప్రమాదం ఉందని అతను గ్రహించాడు. (కీర్తన 51:11)లో అతని పశ్చాత్తాపమును గూర్చి వ్రాయబడెను. “నీ సన్నిధిలో నుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నా యొద్ద నుండి తీసివేయకుము’ అని దావీదు దేవునిని వేడుకొన్నాడు.

దావీదు తన రక్షణ ఆనందాన్ని కోల్పోయాడు (కీర్తన 51:12). జ్ఞానము గల మంచి రాజుగా ఉండటానికి, ప్రవక్తగా మరియు దైవ ప్రేరేపిత కీర్తనలను వ్రాయడానికి శక్తిని కోల్పోయే ప్రమాదంలో దావీదు ఉన్నాడు. ఇవన్నీ పరిశుద్ధాత్మ నుండి అతనికి అనుగ్రహింపబడిన వరములు.

నేడు కూడా, పరిశుద్దాత్మ దేవుడు ఆయన నిజమైన బిడ్డలను ఎప్పటికీ

విడిచిపెట్టడు. "ఏలయనగా, దేవుడు తన కృపావరముల విషయములలోను, పిలుపు విషయములో పశ్చాత్తాపపడడు (మార్పు చేయడు) (రోమా 11:29. ప్రభువైన యేసుక్రీస్తు యొక్క అద్భుతమైన వాగ్ధానం కూడా మనకు ఉంది: "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద ఎల్లప్పుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను, అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. ఆయన మీతో కూడా (సదాకాలం) ఉండును మీలో నివసించును (యోహాను 14:16-17).

ప్రతి క్రైస్తవుడు ఆరోహణుడైన ప్రభువు ఇచ్చిన వరమును (ఎఫెసీ 4:7-16) పరిశుద్ధాత్మ ద్వారా పొందాడు (1 కొరింథీ 12:1-31). మన వరము ఏమిటో మనకు చూపించమని ప్రభువును అడగాలి, ఆపై దానిని ఆయన మహిమ కోసం ఉపయోగించాలి.

## అపోస్తలులు మరియు ప్రవక్త కాలం ముగింపు

అపోస్తలులు మరియు ప్రవక్తలు త్వరలో అంతరించిపోతారని పౌలుకు తెలుసు. కాబట్టి దేవుడు అతనికి ఈ సత్యాన్ని వెల్లడించాడు: "ప్రేమ శాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్థకములగును; భాషలైనను నిలిచిపోవును. జ్ఞానమైనను నిరర్థకమగును. మనము కొంతమట్టుకు ఎరుగుదుము. కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగును" (1 కొరింథీ 13:8-10).

"పూర్ణమైన' అనే పదానికి 'సంపూర్తి' అని అర్థం. గ్రీకు భాషలో ఇది 'వ్యక్తిని' కాదు, 'వస్తువును' సూచించడానికి వాడిన పదం! బైబిల్ మాత్రమే భూమిపై 'సంపూర్తి' మరియు 'పరిపూర్ణమైన' వస్తువు. దాని పేజీలలోని సందేశముతో దేనిని జోడించకూడదు లేదా తీసివేయకూడదు (ప్రకటన 22:18-19) అందులో "పరిశుద్ధులకు ఒక్క సారే అప్పగించబడిన బోధ ఉన్నది" (యూదా 3).

ఆ రోజుల్లో 'జ్ఞానము' అనేది అపోస్తలులు మరియు ప్రవక్తలు బోధించిన సిద్ధాంతాలను గుర్తుంచుకోవడానికి మరియు బోధించడానికి కొంతమంది వ్యక్తులకు ఇవ్వబడిన సామర్థ్యం. ఈ జ్ఞానం కొంత భాగం మాత్రమే. ఇప్పుడు ఆ జ్ఞానము మన బైబిళ్లలో ఇమిడియున్నది.

అపోస్తలులు మరియు ప్రవక్తలు సంఘము యొక్క ప్రారంభ కాలానికి చెందినవారు. ఎక్కువ మంది అపోస్తలులును లేదా ప్రవక్తలను నియమించమని ఎక్కడా

మనకి చెప్పబడలేదు (ఎఫేసీ 2:19–20) (1 కొరింథీ 3:10–11). అపోస్తలులు మరియు వారికి ఇవ్వబడిన అద్భుతాలు, స్వస్థతలు, భాషలు అనే ప్రత్యేక వరములు మన యొద్ద ఇప్పుడు లేవు. ఎందుకంటే మన దగ్గర వాటికన్నా శ్రేష్ఠమైన పరిపూర్ణమైన బైబిల్ ఉంది.

స్థానిక సంఘము యొక్క సాధారణ పనితీరు కోసం ఈ వరములు నేడు సంఘానికి గాని సేవకులకు గాని అవసరం లేదు. ఆ వరములు అన్నీ అపొస్తులుల సందేశాన్ని ప్రజలు విశ్వసించేలా చేయడానికి దేవుడు ఉపయోగించిన తాత్కాలికమైనవి. ఆ వరములను గూర్చి 1 కొరింథీయులు 12వ అధ్యాయంలో వివరించబడ్డాయి; 1 కొరింథీయులకు 13వ అధ్యాయంలో గతించిపోతుంది మరియు 1 కొరింథీయులు 14వ అధ్యాయంలో ఉపయోగంలో ఖచ్చితంగా పరిమితం చేయబడింది. పౌలు అనేక సందర్భాలలో ఈ వరములు దుర్వినియోగాలను సరిదిద్దవలసి వచ్చింది. ఆలాగుననే కొరింథులోని సంఘములో నామకార్ధ విశ్వాసులు ఈ వరము ఉపయోగించడాన్ని పరిమితం చేయాల్సివచ్చింది.

**ఈ వరముల కోసం దేవుడు ఇచ్చిన క్రమాన్ని గమనించండి:** “మరియు దేవుడు సంఘములో మొదట కొందరిని అపోస్తలులుగాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను, అటు పిమ్మట కొందరిని అద్భుతములు చేయువారినిగాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములు గలవారినిగాను, కొందరిని ఉపకారములు చేయువారినిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారినిగాను కొందరిని నానా భాషలు మాట్లాడువారినిగాను నియమించెను. అందరు అపోస్తలులా? అందరు ప్రవక్తలా? అందరు బోధకులా? అందరు అద్భుతములు చేయువారా? అందరు స్వస్థపరచు కృపావరంగలవారా? అందరు భాషలతో మాటలాడుచున్నారా? అందరు ఆ భాషల అర్థము చెప్పుచున్నారా? కృపావరములలో శ్రేష్ఠమైన వాటిని ఆసక్తితో ఆపేక్షించుడి. ఇదియు గాక, సర్వోత్తమమైన మార్గమును మీకు చూపుచున్నాను” (1 కొరింథీ 12:28–31)

ఈ క్రమములో అపోస్థలులు మరియు ప్రవక్తలు మొదటగా ఉన్నారు. భాషలు చివరివి, అయితే అందరికి ఈ వరములు లేవు.

## సంఘాలలో ఈ రోజు భాషలు ఉన్నాయా?

ఎవరైనా భాషలలో మాట్లాడకపోతే వారికి పరిశుద్ధాత్మ లేదని బోధించడం తీవ్రమైన తప్పు.

పెంతెకోస్తు పండుగ దినాన పేతురు మరియు శిష్యులు 'భాషలలో' లేదా 'తెలసిన భాషలలో' మాట్లాడారు (అ.పో.కా. 2:1–12). అక్కడ ఉన్న ప్రజలు వివిధ భాషలు మాట్లాడే వివిధ దేశాల నుండి వచ్చారు; ప్రతి ఒక్కరూ తమ సొంత భాషలో దేవుని అద్భుతమైన పనులను విన్నారు. పౌలు అందరికంటే ఎక్కువ భాషలు మాట్లాడాడు. కానీ సంఘ కూడికలలో ఎప్పుడూ మాట్లాడలేదు (1 కొరింథీ 14:18–19). అతను అనేక దేశాలలో కలిసిన ప్రజలందరికీ సువార్త ప్రకటించడానికి దేవుడు పౌలుకి ఈ వరమును ఇచ్చాడు.

మొదటి సంఘము ఉపయోగించిన మాదిరిగా 'భాషలను' ఉపయోగించడానికి నేటి సంఘానికి ఆ అవసరత లేదు. ప్రవచనం మరియు జ్ఞానముతో పాటు భాషలు కూడా ఇప్పుడు నిలిచిపోయాయి. బైబిల్ లేకుండా అపోస్థలుల సిద్ధాంతాన్ని గుర్తుంచుకోవడం మరియు బోధించే సామర్థ్యం కలిగియుండటమే ఆ దినాల్లో జ్ఞానంగా పరిగణించబడింది (1 కొరింథీ 13:8). నేటి మిషనరీలందరూ, భాషల్లో మాట్లాడతామని తమకు తాము చెప్పుకునే వారు కూడా, వారు సువార్త ప్రకటించే ప్రజల యొక్క మాతృభాషను ముందుగా నేర్చుకోవాలి! లేకపోతే వాటిని అనువదించడానికి ఎవరైనా సంఘములో ఉండాలి.

అపోస్థలుల (క్రీ.శ. 96) మరియు వారి తర్వాత కాలంలో జీవించిన వారి యుగం ముగిసే సమయానికి భాషలు ఆగిపోయాయి. జాన్ క్రిసోస్టమ్ అనే రచయిత (క్రీ.శ. 345–క్రీ.శ 407) తన 'హోమిలీ అనే' గ్రంథంలో ఇలా వ్రాశాడు; మన కాలంలో తెలియని ఆ రోజులలో సర్వసాధారణమైన సంభవాలు (అపోస్తలుల కాలంలో) ఆగిపోయాయి.

ఆ గ్రంథంలో ఇంకా అతను రాస్తూ" అవి చాలా కాలం క్రితమే ఆగిపోయాయి" అని చెప్పాడు (హోమిలీ 4). ప్రస్తుత ఆకర్షణీయమైన ఉద్యమం 1900 ప్రారంభంలో, ఈ వరములను పునరుద్ధరించడానికి ప్రయత్నించడం జరిగింది.

భాషలలో మాట్లాడే వరమును పొందడానికి వీలైనంత వేగంగా దేవుణ్ణి

స్తుతించడం ప్రారంభించాలని, కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని మనస్సును ఖాళీగా ఉంచాలని, ఆ తర్వాత నెమ్మదిగా భాషలలో మాట్లాడటానికి ప్రయత్నం చెయ్యాలని చాలామంది బోధిస్తారు. అప్పుడు పరిశుద్ధాత్మ మీపైకి వస్తాడు మరియు మీరు పరిశుద్ధాత్మ యొక్క భాప్తీస్మం పొందుతారు! కొందరు నేలపై దొర్లడం, కేకలు వేయడం ఇతర వింత చేష్టలు చేస్తారు. బైబిల్ అలాంటి విషయాలను ఎక్కడా బోధించలేదు. సాతాను మోసగాడు అని మనము గ్రహించాలి. "స్త్రీలు సంఘములో మౌనముగా ఉండవలెను" (1 కొరింథీ 14:34) అని బైబిల్ చెబుతున్నప్పటికీ స్త్రీ కూడా ఈ కూడికలలో పాల్గొంటుంది. ప్రాచీన కాలం నుండి స్త్రీలు అన్యమత ఆచారాలలో ప్రముఖంగా పాల్గొనేవారు. అక్కడ వారు విచిత్రమైన మాటలతో మాట్లాడేవారు. వారిలో కొందరు సంఘములోకి వచ్చి అదే పూర్వపు పద్ధతిని సంఘములో ఆచరించడానికి తెగించేవారు. ఎప్పుడైతే దేవుని వాక్యం నమ్మకంగా సంఘానికి బోధించబడుతుందో ఆ సంఘములో ఇలాంటి గందరగోళ పరిస్థితులు కనుమరుగవుతాయి. 'ఆశానిగ్రహం' అనేది ఆత్మ యొక్క ఫలమని బైబిల్ బోధిస్తుంది (గల. 5:22). "మరియు ప్రవక్తల ఆత్మలు ప్రవక్తల స్వాధీనంలో ఉన్నవి. అలాగే పరిశుద్ధుల సంఘములన్నిటిలో దేవుడు సమాధానమునకే కర్త గాని అల్లరికి కర్త కాడు" (1 కొరింథీ 14:32-33). కాబట్టి బోధించేవారు వేగంగా మాట్లాడి, అరుస్తూ, ప్రజలను వెర్రి ఆవేశానికి గురిచేస్తూ మోసగించకుండా జాగ్రత్తపడాలి. దయ్యం పట్టిన బయలు ప్రవక్తలు ఇలాగే ప్రవర్తించారు. కానీ ఏలియా మాత్రం ప్రశాంతంగా సాధారణ ప్రార్థనతో కర్తవ్యాన్ని నిర్వహించాడు. (1 రాజులు 18:20-4). బలమైన గాలి, భూకంపం లేదా అగ్నిలో దేవుని "మిక్కిలి నిమ్మళమైనమైన స్వరం" వినబడలేదు (1 రాజులు 19:11-12)

మనము నిశ్శబ్దంగా ప్రార్థనాపూర్వకంగా ఆయన కోసం వేచి ఉన్నప్పుడు దేవుని స్వరము వినబడుతుంది. మీలాగుననే మనము దేవుని వాక్యాన్ని ప్రశాంతంగా, భక్తితో మరియు యధార్థతతో బోధించినప్పుడు ఆత్మలు రక్షించబడతాయి.

## మరి స్వస్థతల సంగతి ఏమిటి?

పేతురు మరియు పౌలు ఇద్దరూ ప్రజలను స్వస్థపరిచారు, కానీ ప్రతి సందర్భంలోనూ కాదు. "త్రోఫిము రోగియైనందున అతనిని మిలేతులో విడిచి వచ్చితిని" (2 తిమో 4:20). తిమోతికి పౌలు ఇలా వ్రాశాడు; "ఇకమీదట నీళ్ళు త్రాగక నీ కడుపు జబ్బు నిమిత్తమును తరచుగా వచ్చు బలహీనతల కోసరము ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము" (1 తిమోతి 5:23). పౌలు బలహీనులైన వారిని ఎందుకు స్వస్థపరచలేదు? పౌలు "స్వస్థత వరాన్ని" కలిగి ఉన్నాడు. కానీ ఈ అతీంద్రియ వరములపై కూడా దేవుడు సార్వభౌమాధికారం కలిగి ఉన్నాడు. దేవుడు మన ద్వారా నియంత్రించబడడు ప్రభావితం చేయబడడు. ఆయన తన స్వంత సార్వభౌమ చిత్తానికి అనుగుణంగా ప్రతిదీ చేస్తాడు.

నేటి సంఘానికి అపోస్తలులు, ప్రవక్తలు, భాషల వరములు, ప్రవచనాలు మరియు స్వస్థతలు లేవు. అయినప్పటికీ, ప్రార్థనకు సమాధానంగా మరియు అది ప్రభువు చిత్తప్రకారం ఈ రోజు కూడా అద్భుతాలు మరియు స్వస్థతలు కొన్నిసార్లు కొన్ని సమయాల్లో జరుగుతాయని మనము నమ్ముతున్నాము.

ఈ రోజున ఎవరికైనా "స్వస్థత వరాలు" ఉన్నట్లయితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులన్నీ ఖాళీ అయిపోయేవి. అనేక మంది చనిపోయినవారు తిరిగి లేపబడేవారు. మాకు స్వస్థత వరాలు వున్నాయి అని ప్రచార పటోపాటం చేసుకొనేవారికి ఇది ఒక సవాలు. ప్రభువైన యేసు భూమిపై ఉన్నప్పుడు, ఆయన తన వద్దకు వచ్చిన వారందరినీ సంపూర్ణంగా పూర్తిగా స్వస్థపరిచాడు, మృతులలో నుండి ముగ్గురు వ్యక్తులను లేపాడు మరియు అనేకమందిలో గొప్ప ఆనందాన్ని కలిగించాడు. కొన్నిసార్లు అపోస్తలులు కూడా ఇలా చేసారు. కానీ ప్రతి సందర్భంలోనూ కాదు.

### ముగింపు.

ఈ వరాలను గూర్చి బోధిస్తూ, పౌలు ఇలా చెప్పాడు; "కృపావరములలో శ్రేష్ఠమైన వాటిని ఆసక్తితో ఆపేక్షించుడి. ఇదియుగాక సర్వోత్తమమైన మార్గమును మీకు చూపుచున్నాను" (1 కొరింథీ 12:31). "ప్రేమ కలిగియుండుటకు ప్రయాసపడాలని" మరియు "ప్రవచిస్తే ప్రవచించవచ్చని" ఎందుకంటే క్షేమాభివృద్ధియు హెచ్చరికయు

ఆదరణయు కలుగునట్లు ప్రవచించువాడు మనుష్యులతో మాటలాడుచున్నాడని పౌలు బోధించాడు (1 కొరింథీ 14:1-4).

ప్రేమ ప్రధానమైన విషయం, ఎందుకంటే ప్రేమ ఐక్యపరుస్తుంది. అయితే అపోస్తులులకు మరియు ప్రారంభ శిష్యులకు ఇచ్చిన ఈ ప్రత్యేక వరాలపై వాదనలు అనేక సంఘాలను విభజించాయి. ఈ రోజు బోధకుడు ప్రవక్త స్థానాన్ని ఆక్రమించాడు మరియు అతని బోధన ఈ క్రింది వాటి కోసం ఉండాలి.

1. **క్షేమాభివృద్ధి కోసం** అనగా విశ్వాసులను వారు విశ్వసించు అతిపరిశుద్ధమైన దాని మీద 'కట్టుట'
2. **హెచ్చరిక లేక హితబోధ.** అది విశ్వాసులను విధేయతతో మరియు క్రమశిక్షణతో కూడిన జీవితాలను గడపడానికి 'ప్రేరేపిస్తుంది'.
3. **ఆదరణ కోసం.** అది గాయపబడిన ఆత్మలను మరియు విరిగిన హృదయాలను 'స్వస్థపరచి' ఓదార్పునిస్తుంది.

కాబట్టి, స్వస్థతలు, అద్భుతాలు వంటి అతీంద్రియ సంకేత వరాలు గూర్చి సంచలనాత్మక వాదనల ద్వారా తప్పుదారి పట్టించకుండా చాలా జాగ్రత్తగా ఉందాం. దానికి బదులుగా క్రైస్తవ విశ్వాస ప్రయాణంలో ఒకరినొకరు ప్రేమించడం. శ్రద్ధ వహించడం మరియు పోషించడం వంటి "సర్వోత్తమమైన మార్గానికి" మనలను మనం అప్పగించుకొందాం.

**దేవుని కృప పాఠకులందరికి తోడైయుండును గాక!! ఆమెన్.**



## ఆల్బర్ట్ గారి సంఘకాపరుల చేతి పుస్తకాల అధ్యయనాలు

చాలా సంవత్సరాలుగా ఆల్బర్ట్ గారు మరియు ఆయన సతీమణి ఎలీనా గారు సంపూర్ణంగా దేవుని సేవలో ఉన్నారు. వీరు ఆస్ట్రేలియా దేశంలోని క్వీన్స్ ల్యాండ్‌లో ఉంటారు. ఆస్ట్రేలియా మరియు కెన్యా దేశాల్లో వీరి సేవ ద్వారా అనేక సంఘాలు స్థాపించబడ్డాయి. ఆల్బర్ట్ గారు అనేక మాసపత్రికలు వ్రాశారు.
వీరి బోధలు ఇప్పుడు పుస్తకరూపంలో ప్రచురించబడుతున్నాయి.

## ఇతర ప్రచురణలు

పుస్తకం - 1

**'సంఘకాపరుల చేతి పుస్తకం' మరియు 'పరిశుద్ధాత్మ'**

బైబిల్ బోధకులు మరియు విద్యార్థులకు లేఖనాల మార్గదర్శి

పుస్తకం - 2

**'యుగయుగాలకు దేవుని గొప్ప ప్రణాళికలు'**

పరిశుద్ధులను సంస్కరించడానికి ఎంచుకన్న అధ్యయనాలు

పుస్తకం - 3

**'రాబోవు సంగతులు'**

ప్రవక్తల గ్రంధాల అధ్యయనం

పుస్తకం - 4

**'శ్రమలపై విజయం'**

రూతు, యోబు మరియు ఇతర పుస్తకాల్లోని పాఠాలు

ఈ పుస్తకాలు ఆర్థిక వనరుల అందుబాటును బట్టి ముద్రించబడతాయి.
PDF ఫైల్స్ కావల్సి వస్తే ఈమెయిల్ ద్వారా పంపుతాము.
మా ఈమెయిల్ అడ్రస్ :

Albert Fairweather Email : aefairweather1@gmail.com
John Denman Email : jldenman@hotmail.com.au
Dr Mel Heazlewood pheazlew@bigpond.net.au